

మహానాడు వేదికపై మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్



మహా సంరంభం

● తొలిరోజు సూపర్‌హిట్ ● పసుపువర్ణంతో ముస్తాబైన వేదిక ● కడప మహానాడు చరిత్రలో నిలిచిపోతుంది



కడపలో
మహానాడు మహాసంబరంగా మొదలైంది. తెలుగు రాష్ట్రాలతో పాటు అండమాన్ నికోబార్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి తరలివచ్చిన టీడీపీ శ్రేణులతో మహానాడు ప్రాంగణం పండుగను తలపించింది. మూడురోజుల పాటు నిర్వహించే మహానాడు తొలిరోజు మంగళవారం ఉదయం 6 గంటలకే వేదిక వద్దకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్రాంగణానికి వెళ్లారు. ఉదయం పూట పసుపు సైన్యానికి చిరుజల్లుల వర్షం స్వాగతం పలికింది. మొత్తంగా తొలిరోజు సూపర్‌హిట్‌గా సాగింది.

- తొలిసారి డిజిటల్ ఫొటో ఎగ్జిబిషన్
- చిత్తూరు పార్లమెంటు కేంద్రంలో చంద్రబాబు రిజిస్ట్రేషన్
- సెంటర్ ఆఫ్ ది అట్రాక్షన్‌గా నారా లోకేశ్
- తరలివచ్చిన నారీలోకం
- మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరాలు
- అతిథులకు పసందైన వంటకాలు
- తొలిరోజు పార్టీ మౌలిక సిద్ధాంతాలు, ఆరుసూత్రాలపై చర్చ
- ఈసారి పదికి పది గెలవాల్సిందే : చంద్రబాబు

(కడప ఆంధ్రజ్యోతి బృందం): మూడు రోజుల పాటు నిర్వహించే మహానాడు తొలిరోజు మంగళవారం ఉదయం 6 గంటల నుంచే మొదలైంది. రెండు రోజులు జరిగే ప్రతినిధుల సమావేశానికి రాష్ట్రం నుంచి 23 వేల మందికి ఆహ్వానాలు పంపారు. వీరందరికీ జిల్లా వ్యాప్తంగా వివిధ చోట్ల బస ఏర్పాటు చేశారు. మహానాడు ప్రాంగణంలో పార్లమెంటు వారీగా రిజిస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఉదయం 6 గంటల నుంచే రిజిస్ట్రేషన్ చేయించుకుని పాసులు తీసుకుని ప్రాంగణంలోకి వెళ్లారు. వివిధ ప్రాంతాల నుంచి తెలుగు మహిళలు తరలివచ్చారు.

● ఉదయం 10:30 గంటలకు సీఎం చంద్రబాబు మహానాడు ప్రాంగణానికి వచ్చారు. ప్రతినిధుల నమోదు కౌంటర్‌లో సీఎం తన ఐడీ కార్డు ద్వారా పేరును నమోదు చేసుకుని ముందుకు నడిచారు.

● 10:45 గంటలకు మాజీ మంత్రి శ్రీపతి రాజేశ్వర్ చిత్రపటానికి నివాళులర్పించారు. (శ్రీపతి అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా పనిచేశారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని పోరాడిన వ్యక్తి.)

● మహానాడు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని చూసుకుంటూ సీఎం వేదిక వద్దకు నడిచారు.

● సీఎం 10:48 గంటలకు తారకరామ అనే పుస్తకంతో పాటు తన పేరుతో ఉన్న పుస్తకాలను ఆవిష్కరించారు.

● 10:50 గంటలకు ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● 10:52 గంటలకు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించి, అక్కడి దాతలను పరామర్శించారు.

● 11:59 గంటలకు చక్రాయపేట మండలంలోని గండి క్షేత్రం తరపున అధికారులు పట్టెం గురుప్రసాద్, వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకులు కేసరి, రాజా స్వాములు సీఎంను సన్మానించి వీరాంజనేయస్వామి చిత్రపటాన్ని బహూకరించారు.

● 11:00 గంటలకు సీఎం చంద్రబాబు మహానాడు వేదిక మీదకు వచ్చారు. వేదికపై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అక్కడే టీడీపీ జెండాను ఆవిష్కరించారు.

● 11:06 గంటలకు వేదికపై అందరూ లేచి నిలబడగా 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' గీతాన్ని వినిపించారు.

● అసువులు బాసిన కార్యకర్తలకు, నాయకులతో పాటు పెహల్గాం మృతులకు, వీర సైనికులకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అందరూ సంతాపం తెలిపారు.

● 11:21 గంటలకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో పల్లా శ్రీనివాసరావు తొలి ప్రసంగాన్ని ప్రారంభించారు. వర్ల రామయ్య టీడీపీ ప్రధాన కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు.

● 11:53 గంటలకు చంద్రబాబు ప్రసంగం ప్రారంభమైంది.



డ్రైఫ్రూట్స్ మాలతో సీఎం చంద్రబాబును, ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న ఆర్వీ సుబ్బారెడ్డి, సుగవాసి యువరాజ్ తదితరులు

● ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల వైపునుంచి వచ్చే వాహనాలు ట్రాఫిక్ జాం కావడంతో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు నడుచుకుంటూ సభా ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. ట్రాఫిక్ కంట్రోల్ కాకపోవడంతో డీఐజీనే స్వయంగా రంగంలోకి దిగారు.

● చంద్రగిరికి చెందిన టీడీపీ నాయకుడు ఈశ్వరరెడ్డి ప్రసంగిస్తూ నారా లోకేశ్‌కి పార్టీ బాధ్యతలు అప్పగించాలని పేర్కొనడంతో సభలో ఉత్సాహంతో కేరింతలు కొట్టారు.

● 12.48 నుంచి 1.06 వరకు లోకేశ్ ప్రసంగం, నా తెలుగు కుటుంబం పేరిట సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అంటూ ప్రస్తుత ట్రెండింగ్‌కు తగ్గట్లుగా ఆరు శాసనాలపై వివరించారు.

● 1.10కి పార్టీ అధ్యక్షుడి ఎన్నిక కోసం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య నోటిఫికేషన్ విడుదల చేశారు. బుధవారం 2 గంటల నుంచి 4.30కు ఎన్నిక, ఫలితాల ప్రకటన ఉంటుందన్నారు.

● 1.10 నుంచి 2 గంటల వరకు భోజన విరామం

● మీడియా పాయింట్‌లో మీడియాకు ఏర్పాటు చేసిన భోజనాల వద్ద ఇతరులు ఎగబడటంతో తోపులాట జరిగింది.

● 2.20కి సెకండ్ సెషన్ ప్రారంభం కాగానే నారా లోకేశ్ ప్రవేశపెట్టిన ఆరు శాసనాల తీర్మానంపై మంత్రి కొల్లు రవీంద్ర, పత్తిపాటి వెంకటరాజు, వెంకటనరసింహారావు, వేణుగోపాల్‌రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, దుర్గాప్రసాద్‌లు ఆమోదం తెలిపి ప్రసంగించారు.

● 3.10 గంటలకు యువగళం తీర్మానాన్ని మంత్రి భరత్ ప్రవేశపెట్టారు. యువత, సంక్షేమం అంశంపై ఎంపీ బలశెట్టి అప్పల్‌నాయుడు, కడప జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, తెలంగాణ నేత జోగారపు జయరాజ్ బలపరిచారు. సాంకేతిక విజ్ఞానం అంశంపై ఎమ్మెల్యే రాధాక్రిష్ణ, నరహరి బలపరిచారు. అనంతరం వివిధ అంశాలపై పలు తీర్మానాలను ప్రవేశపెట్టి వాటిని ఆమోదించారు. లోకేశ్ సూచించిన ఆరు శాసనాలపై మంత్రులు ప్రసంగించారు. ప్రసంగాలపై వాట్సప్, ఐవీఆర్ఎస్ సర్వే చేసి రేటింగ్ ఇచ్చారు.

● సాయంత్రం 6.20 గంటలకు తొలిరోజు ప్రతినిధుల సభ ముగిసింది.

● మహానాడుకు హాజరైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కమలాపురం, కడప ఎమ్మెల్యేలు మంగళవారం సత్కరించారు. ఎమ్మెల్యే ఆర్.మాధవి, జిల్లా అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి డ్రైఫ్రూట్స్ మాలతో సత్కరించగా, పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డి గజమాలతో సన్మానించారు.

పదికి పది గెలవాల్సిందే

- సీఎం చంద్రబాబు

కడపలో నిర్వహిస్తున్న మహానాడు చరిత్రలో నిలిచిపోతుంది. టీడీపీ ఆవిర్భవించిన తరువాత ఇంతవరకు 34 మహానాడులు నిర్వహించాం, అందులో రెండు డిజిటల్‌లో నిర్వహించాం. అయితే దేవునికడప అయిన కడపలో నిర్వహించే మహానాడు మాత్రం చరిత్రలో నిలిచిపోతుంది. ఉమ్మడి కడప జిల్లాలో ఏడు సీట్లు గెలుచుకున్నాం. ఈసారి పదికి పది సీట్లు గెలవాల్సిందే. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా కొప్పర్తి పారిశ్రామికవాడను అభివృద్ధి చేస్తున్నాం.



మహానాడు వేదికపై లోకేశ్‌తో పుట్టా సుధాకర్ యాదవ్, పుట్టా మహేశ్ ముచ్చట్లు



మహానాడులో చంద్రబాబును కలిసిన బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ రితేష్‌కుమార్ రెడ్డి



ప్రతినిధుల సభకు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న జగన్‌మోహన్‌రాజు



మహానాడు నిర్వహణకు సీఎం చంద్రబాబు చేతికి రూ. 5 లక్షల చెక్కును అందజేస్తున్న గోవర్ధన్ రెడ్డి



మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో ముక్కా రూపానందరెడ్డి, వేమన సతీష్



సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి

మహానాడు ఏర్పాట్లు బాగున్నాయి

మహానాడు ఏర్పాట్లు బాగున్నాయంటూ సీఎం చంద్రబాబునాయుడు సంతృప్తి వ్యక్తం చేశారని జిల్లా టీడీపీ నేతలను అభినందించినట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. కడపలో మహానాడును తొలిసారిగా నిర్వహించారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, పుత్తా చైతన్యరెడ్డి, వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, భూపేశ్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు ఎస్‌గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్ పనులు పర్యవేక్షిస్తూ దచ్చారు. ఒకే చోట మహానాడు నిర్వహణ, సమీపంలోనే పార్కింగ్ స్థలం దొరకడం.. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయడంతో చంద్రబాబు సంతోషం వ్యక్తం చేస్తూ టీడీపీ నేతలను అభినందించారు.

మహానాడులో నేటి కార్యక్రమాలు

రెండోరోజు బుధవారం ఉదయం 10 నుంచి 10.15 వరకు యుగపురుషుడు ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా ఘన నివాళి. 10.15 నుంచి ఒంటిగంట వరకు ఆరుసూత్రాల్లో మూడో అంశమైన తెలుగు జాతి-విశ్వఖ్యాతి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 వరకు ఆరుసూత్రాల్లో 4, 5, 6 అంశాలపై స్త్రీ శక్తి, సామాజిక న్యాయం, పేదల ప్రగతి, అన్నదాతకు అండ అంశాలపై చర్చిస్తారు. 4.30 నుంచి 5 వరకు సమగ్ర నీటి ప్రణాళికలో ఉజ్వల ప్రగతి, ప్రజల సంరక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ అంశాలపై తీర్మానం, సాయంత్రం 5 నుంచి 6 వరకు రాజకీయ తీర్మానం, సాయంత్రం 6 నుంచి 7 వరకు జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రకటన, ప్రమాణ స్వీకారం ప్రసంగం ఉంటుంది. మూడోరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి బహిరంగసభ.





మహానాడు సంబరం

టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్య క్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలా ది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాం డ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్ర బాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందుభోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండో రోజు మహానాడు కోసం అంద రూ ఉత్సాహంగా ఎదురు చూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.








ఎమ్మెల్యే మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి









కడప మహానాడు.. నభూతో నభవిష్యత్..

(కడప -ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడు నభూతో.. నభవిష్యత్ అనే రీతిలో సాగుతోంది. ఈ కార్యక్రమానికి హాజరైన సామాన్య కార్యకర్త నుంచి ముఖ్యమంత్రి వరకు అందరిలోనూ ఉత్సాహం ఉరకలు వేస్తోంది. తమ పార్టీ రాబోయే మరెన్నో సంవత్సరాలు తెలుగు ప్రజలకు సేవ చేయాలని కోరుకుంటున్నారు. ఈ సందర్భంగా మహానాడు సభా ప్రాంగణంలో.. పలువురు పార్టీ ముఖ్యులతో ఆంధ్రజ్యోతి ముచ్చటించింది.. వాళ్లు ఏమన్నారంటే..

● కడప ఎవరి అడ్డా కాదు..

వైఎస్ జగన్ అడ్డా... కడపలో మహానాడు నిర్వహిస్తున్నామనడం.. సరైంది కాదు. కడప ఎవరి అడ్డా కాదు.. జగన్ తక్కువ మెజార్టీతో ఎలాగో అదృష్టంతో గెలిచాడు. గతంలో కూడా కడపలో మహానాడు నిర్వహించాలని అనుకున్నాం.. కుదరలేదు.. ఈసారి రాయలసీమలో నిర్వహించాలని అనుకుని.. కడపలో ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది తెలుగుదేశం పార్టీ పసుపు పండుగ మహానాడుకు తరలివస్తున్నారు. కొన్ని పార్టీలు తమ కార్యకర్తలను కూలీల లాగా చూస్తాయి. టీడీపీలో కార్యకర్తలంటే కుటుంబ సభ్యులే. 10 నెలలు రాష్ట్ర అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టి పెట్టారు. కాబట్టి కార్యకర్తల గురించి ఆలోచించే సమయం దొరకలేదు. ఇక కార్యకర్తల సంక్షేమం కూడా చూస్తారు. కార్యకర్తలను కాపాడుకుంటాం.

- ఆనం వెంకటరమణారెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి

● మాకు దక్కిన గౌరవం..

కడపలో జరుగుతున్న మహానాడు నభూతో.. నభవిష్యత్ అనే రీతిలో జరుగుతోంది. 2025 సంవత్సరానికి సంబంధించి పసుపు పండుగ కడపలో జరగడం మాకు దక్కిన గౌరవం. పార్టీలో సంస్థాగతంగా ఏమేమీ మార్పులు తీసుకురావాలో.. పరిపాలనలో ఏమి మార్పులు తీసుకురావాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు, మంత్రి నారా లోకేశ్ పరిశీలిస్తున్నారు.

- ఆర్.మాధవి, ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే

● మూడో తరం నాయకుడిని చూస్తోంది..

కడప మహానాడు మూడవ తరం నాయకుడిని చూస్తోంది. పార్టీ స్థాపించిన ఎన్టీ రామారావు తరంలోనూ. చంద్రబాబునాయుడు తరంలోనూ.. పార్టీ బలంగా ముందుకు సాగింది.. మూడో తరం నాయకుడు నారా లోకేశ్ సారధ్యంలో పార్టీ మరింత బలంగా ముందుకు సాగుతుంది. టీడీపీ కార్యకర్తలు, నాయకుల వల్ల ఇప్పటికీ ముందుకు సాగుతోంది. 43 సంవత్సరాలలో 34 మహానాడు కార్యక్రమాలు జరిగాయి. రాష్ట్రంలో అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలంటే టీడీపీతోనే సాధ్యం. సాగునీటి, వ్యవసాయం, సంక్షేమం, విద్యారంగం.. ఏ రంగమైనా సమగ్రంగా అభివృద్ధి జరగాలంటే చంద్రబాబుకే సాధ్యం.

- పార్థసారధి, హిందూపురం ఎంపీ

● భవిష్యత్ నాయకుడు నారా లోకేశ్

ఇప్పటి వరకు అనుభవజ్ఞులైన చంద్రబాబు నాయకత్వంలో పార్టీ ముందుకు సాగింది. ఎన్నో ఒడిదుడుకులు తట్టుకుని పార్టీ నిలబడింది. చంద్రబాబు అరెస్టు సమయంలోనూ.. ఇంకా అనేక క్లిష్ట సమయాలలో నారా లోకేశ్ ఎంతో ధైర్యంగా ముందుకు నడిచారు. యువగళం పాదయాత్రను రాష్ట్రమంతటా నిర్వహించి టీడీపీ కార్యకర్తలు, నాయకుల్లో ఆత్మస్థైర్యం నింపారు. ఈ పరిస్థితుల్లో పార్టీ, రాష్ట్ర భవిష్యత్ నాయకుడు నారా లోకేశే. ఆయనకు ఎటువంటి పదవి ఇచ్చినా సముచితమే. పార్టీ అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా ఇంకా తమకు పదవులు రాలేదని ఎవరూ బాధపడాల్సిన అవసరం లేదు. పార్టీ అధినాయకత్వం అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి పదవులు ఇచ్చి గౌరవిస్తుంది.

- ధూళిపాళ్ల నరేంద్ర, ఎమ్మెల్యే

● ప్రజల కోరిక మేరకే కడపలో మహానాడు

ఇక్కడి నాయకులు, ప్రజల కోరిక మేరకు కడపలో మహానాడు నిర్వహిస్తున్నాం. రాయలసీమ జిల్లాల్లో మొన్న జరిగిన ఎన్నికల్లో 99 శాతం సీట్లు టీడీపీకే వచ్చాయి. అందుకే కడపలో ఈ మహానాడు ఏర్పాటు చేసింది. ఐదు సంవత్సరాలలో వైసీపీ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మొట్టమొదటగా ఇక్కడ నిర్వహిస్తున్న మహానాడుకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది. మహానాడు రాయలసీమలో ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతానికి మహర్దశ పట్టబోతోంది.

- బీసీ జనార్దన్‌రెడ్డి, మంత్రి

● లోకేశ్ అంటే కార్యకర్తలకు భరోసా..

లోకేశ్ అంటేనే కార్యకర్తలకు, మాకు భరోసా. దేశ విదేశాలు తిరిగి పరిశ్రమలు తెచ్చి 20లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. అలాగే విద్యాశాఖలో విప్లవాత్మకమైన మార్పును తెచ్చి నాణ్యమైన విద్యను ఇవ్వబోతున్నారు. పార్టీ కార్యకర్త చనిపోతే రూ.5లక్షలు ఇస్తున్న ఏకైక పార్టీ టీడీపీ. లోకేశ్‌కు కార్యకర్తలపైనే దిశ, దశ, ధ్యాస. పార్టీ కార్యకర్తలు, అభివృద్ధిపైనే మహానాడులో తీర్మానాలుంటాయి.

- మంత్రి సవిత



మహానాడు కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు



మహానాడు వేదికపై శ్రీనివాసరెడ్డి, తదితరులు



మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, నారాయణ



ఆంజనేయస్వామి చిత్రపటాన్ని అందిస్తున్న గండి ఈవో, పూజారులు



మహానాడు ప్రాంగణం వద్ద వికాస్ హరికృష్ణ

పసుపుమయం.. మహానాడు ప్రాంగణం

- ● భారీగా నిలిచిపోయిన వాహనాలు
- ● గాలికి పడిపోయిన పలు ఫ్లెక్సీలు

కడప క్రైం, మే 27(ఆంధ్రజ్యోతి): మహానాడు సభాప్రాంగణమంతా పసుపుమయమైంది. కార్యకర్తలు, నాయకులు వస్తారనుకుంటే పెద్ద ఎత్తున అభిమానులు తరలిరావడంతో జనసంద్రంగా మారింది. ఉదయం 7గంటల నుండి కార్యకర్తలు, నాయకులు సభా ప్రాంగణంలోకి విచ్చేశారు. 9గంటల నుండి వాహనాలు పూర్తిగా స్తంభించిపోవడంతో సాక్షి సర్కిల్ నుండి సభా ప్రాంగణం వరకు రావాలంటే గంటల కొద్దీ సమయం పట్టింది. అలాగే రాయచోటి రింగు రోడ్డులో కూడా సభా ప్రాంగణానికి దాదాపు మూడు కి.మీ మేర వాహనాలు బారులు తీరాయి. మంత్రులు, పార్టీ ప్రముఖులు, కొంత మంది నాయకులు వాహనాలు వదిలేసి కాలినడకన వేదిక వద్దకు చేరుకున్నారు. కేంద్రమంత్రులు పెమ్మసాని, కింజారపు రామ్మోహన్‌నాయుడులు కూడా కాలినడకన చేరుకున్నారు. వీరికి వాహన పార్కింగ్‌పై సరైన అవగాహన లేకపోవడంతో పోలీసులు వాహనాలను అనుమతించలేదు. దీంతో కొందరు నేతలు కాలినడకన సభాప్రాంగణానికి చేరుకున్నారు. వారు వచ్చిన కార్లను పార్కింగ్ స్థలంలో పెట్టే క్రమంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇదే అదునుగా చిన్న చిన్న ఆటోలు 3 కి.మీ దూరానికి రూ.50మేర ప్రయాణికుల నుంచి బాడుగ పేరుతో దోచుకున్నారు. ప్రయాణికుల్లో ఎక్కువమంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కావడంతో అవగాహన లేక ఆటోలు దొరికిందే చాలు అని ఎక్కేశారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు రోడ్లపై వాహనాల పరిస్థితి ఇదే విధంగా సాగింది.

రోడ్లపై వాహనాలు పక్కకు తొలగింపు

సోమవారం వర్షం పడుతుండటంతో పార్కింగ్ ప్రదేశాలు బురదమయమయ్యాయి. దీంతో దూరంలో ఉన్న స్థలాల్లో కార్లు పార్కింగ్ చేయకుండా వేదిక వద్ద, రోడ్లపైనే వెహికల్స్ ఆపి ఉంచారు. అడ్డంగా ఉంచిన వాహనాలను క్రేన్ సహాయంతో పోలీసులు పక్కకు లాగారు.

నేలకొరిగిన ఫ్లెక్సీలు

మహానాడు వేడుకకు హాజరయ్యే రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే టీడీపీ నాయకులకు, శ్రేణులకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు సోమవారం వీచిన గాలులకు నేలకొరిగాయి. కొన్ని సభాప్రాంగణం ప్రారంభమయ్యే మధ్యలో విరిగిపడ్డాయి. ఆ సమయంలో పోలీసులు అప్రమత్తంగా ఉండటంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. పడిపోయిన ఫ్లెక్సీలను పోలీసులు ఎప్పటికప్పుడు తొలగించారు. ఓ భారీ ఫ్లెక్సీ నేలకొరుగుతున్న సమయంలో సీఐ బాలమద్దిలేటి అక్కడున్న సిబ్బందిని అప్రమత్తం చేయడంతో ఫ్లెక్సీ పడకుండా పోలీసులు అడ్డుకున్నారు.



సభాప్రాంగణం వద్ద నేలకొరిగిన కటౌట్



ప్రతినిధుల సభకు సభ్యత్వం రిజిస్ట్రేషన్ వద్ద బారులు



ట్రాఫిక్‌ను కంట్రోల్ చేస్తున్న కర్నూలు రేంజ్ డీఐజీ ప్రవీణ్

మహా సందడి

కడప/కలెక్టరేట్/సీకేదిన్నె/ మే 27 (ఆంధ్రజ్యోతి): కడప చరిత్రలో తొలిసారిగా టీడీపీ మహానాడు కార్యక్రమం నిర్వహిస్తోంది. సీకేదిన్నె మండలంలోని పబ్బాపురంలో ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు కన్నుల పండువగా జరుగుతోంది. ఈ సందర్భంగా ఆ మహా పండుగలో సందడి వాతావరణం నెలకొంది. కార్యకర్తల సెల్ఫీలు, మహిళా నేతల వస్త్రాధరణ, సైకిల్ యాత్రలో వచ్చిన అభిమానులతో కళకళలాడింది.

సెల్ఫీల సందడి



కడప చరిత్రలో తొలిసారిగా టీడీపీ మహానాడు కార్యక్రమం నిర్వహిస్తోంది. సీకేదిన్నె మండలంలోని పబ్బాపురంలో ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు కన్నుల పండువగా జరుగుతోంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు తెలంగాణ రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఇక మహానాడు వేదిక ఎంట్రెన్స్‌లోకి అడుగు పెట్టగానే నేతలు, కార్యకర్తలు సెల్ఫీలతో సందడి చేశారు. తమ అభిమాన నేతలను వారి సెల్‌ఫోన్లలో బంధించారు.

పసుపు కండువాలకు గిరాకీ



మహానాడు సమీపంలోని రోడ్డుకిరువైపులా టీడీపీ జెండాలు, పసుపు రంగు గొడుగులు, కండువాలు, స్టిక్కర్లు, బ్యాడ్జీలతో దుకాణాలు వెలిశాయి. దీంతో నాయకులు, కార్యకర్తలు తమ పార్టీ అభిమానం చాటుతూ పెద్ద ఎత్తున పోటీపడి కొనుగోలు చేశారు. చేనేత వస్త్రాల దుకా ణాల వద్ద ఇతర జిల్లాల నేతలు, కార్యకర్తలు పసుపు రంగు ఖాదీ వస్త్రాలు, పొందూరు ఖద్దర్ కొనుగోలుతో బిజీబిజీగా గడిపారు.

లోకేశ్ అభిమానుల హడావిడి



టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు వేడుకలకు కాకినాడ సిటీ నుంచి పెద్దఎత్తున యువనేత లోకేశ్ అభిమానులు తరలివచ్చారు. తమ అభిమానాన్ని చాటుకుంటూ లోకేశ్ నాయకత్వం వర్ధిల్లాలంటూ ఆయన పోటోలు ప్రదర్శిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.

పసుపు రంగు వస్త్ర ధారణలో మహిళలు



మహానాడు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చిత్తూరు జిల్లా గురజాల నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. వారిలో కొందరు మహిళలు పార్టీపై ఉన్న వీరాభిమానంతో పసుపు పచ్చరంగు పట్టు చీరలు ధరించి ఆకర్షణగా నిలిచారు.

సైకిల్‌పై 300 కి.మీ. ప్రయాణం



పల్నాడు జిల్లా గురజాల నుంచి కడపకు వచ్చిన షేక్ బాజీ మహానాడులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పసుపు వస్త్రాలు ధరించి సైకిల్‌కు టీడీపీ జెండా కట్టుకొని దాదాపు 300 కి.మీ. ప్రయాణం చేసి మహానాడు కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ అంటే తనకు ఎనలేని ఇష్టమని, అందుకే కష్టమైనా సైకిల్ తొక్కుకుంటూ వచ్చానని తెలిపారు.

1300 మందికి వైద్య పరీక్షలు



మహానాడులో తొలిరోజు జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటల వరకు దాదాపు 1300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో కంటి, ఎముకలకు సంబంధించి 800 మందికి, వివిధ రకాల సాధారణ జబ్బులకు 500 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఐసీడీఎస్ 'కుక్కర్ల' కొనుగోలు కేసులో..

ఇద్దరు రిటైర్డు సీడీపీవోల పెన్షన్‌లో కోత

కలికిరి, మే 27 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఐసీడీఎస్‌లో జరిగిన కుక్కర్ల కొనుగోలు కుంభకోణం కేసులో ఇద్దరు రిటైర్డు సీడీపీవోల పెన్షన్‌లో కోత విధిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసిం ది. రిటైరయిన సీడీపీవోలు సి.శ్రీమాతమ్మ, పి.భారతిల పెన్షన్ నుంచి ఒక శాతం ఏడాదిపాటు కోత విధిస్తూ మంగళవారం ఆదేశాలు జారీ అయ్యాయి. ఇదే కేసులో అప్పటి కడప ఉమ్మడి జిల్లా స్త్రీ, శిశు అభి వృద్ధి శాఖ ప్రాజెక్ట్ డైరెక్టరుగా పనిచేసిన కె.లీలావతి ప్రధాన సూత్ర ధారిగా తేలింది. అయితే విచారణ జరుగుతున్న దశలోనే ఆమె నాగ పూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2019 జూలై 24న మరణించింది. దీంతో ఆమెపై కేసును ముగించారు. 2015లో జరిగిన కుక్కర్ల కొను గోలులో వ్యవహారంలో మొత్తం రూ.74,69,060ల అవినీతి జరిగిందని విచారణలో తేలింది. పీడీ కె.లీలావతితోపాటు అప్పటి కడప ఐసీడీఎస్ సీడీపీవో వి.అరుణకుమారి, కమలాపురం ఏసీడీపీవో శ్రీమాతమ్మ, లక్కిరెడ్డిపల్లె సీడీపీవో రమాదేవి, రాయచోటి సీడీపీవో పి.భారతి, సిద్దవ టం సీడీపీవో పి.నిర్మలను దోషులుగా తేల్చారు. మిగిలిన సొమ్మును ప్రభుత్వానికి నిర్దిష్ట సమయంలో తిరిగి చెల్లించని పి.నిర్మలపై వున్న మరో అభియోగంలో విడిగా మరో ఉత్తర్వు జారీ చేయనున్నట్లు కూడా ప్రభుత్వం పేర్కొంది. వీరిపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ డైరెక్టరును ప్రభుత్వం ఆదేశించింది. విచారణ దశలో మరణించిన పీడీ లీలావతిపై కేసు మూసివేసినా ఆమెకు రావలసిన పెన్షనరీ లబ్ధి నుంచి అవినీతి జరిగిన సొమ్మును రాబట్టాలని ఆదేశిం చారు. కాగా పొట్రెడ్డిగారిపల్లె అంగన్‌వాడీ కార్యకర్త నియమాకంలో అక్రమాలకు పాల్పడిన సీడీపీవో భారతికి గతంలోనే రెండు ఇంక్రిమెం ట్లు కోత విధించారు. ఇక ప్రస్తుతం ఉద్యోగాల్లో కొనసా గుతున్న కడప సీడీపీవో వి.అరుణకుమారి, లక్కిరెడ్డిపల్లె సీడీపీవో పి.రమాదేవి, సిద్దవటం సీడీపీవో పి.నిర్మలను నిందితులుగా నిర్ధారిస్తున్నట్లు గత నెలలోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిపై తదుపరి చర్య లకు ఉత్తర్వులు రావలసి వుంది. ఈ మేరకు రాష్ట్ర స్త్రీ, శిశు, ప్రత్యేక ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యదర్శి ఏ.సూర్యకు మారి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

నకిలీ అరటి మొక్కలు సరఫరా చేసిన కంపెనీలపై చర్యలు



దెబ్బతిన్న అరటి తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సింహాద్రిపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ అరటి మొక్కలు సరఫరా చేసిన కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల ఉద్యానవనశాఖ అధికారి మల్లేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. దెబ్బతిన్న అరటి తోటలను మంగళవారం ఉద్యాన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ స్నేహలతరాణి పరిశీలించారు. ల్యాబ్‌కు పంపించి తగిన నివేదికను రైతుకు అందజేస్తామని తెలిపారు. వివరాల్లోకెళితే.. సింహాద్రిపురానికి చెందిన ఎస్.వాసుదేవరెడ్డి తనకున్న నంద్యాలంపల్లి పొలంలో గత సంవత్సరం కిసాన్ అగ్రి బయోటెక్ కంపెనీకి చెందిన అరటి మొక్కలు 4 ఎకరాల విస్తీర్ణంలో నాటుకున్నారు. మొక్కల వేరు వ్యవస్థ సరిగా లేకపోవడంతో పెరుగుదల లేక రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. 4 ఎకరాల అరటి సాగుకు రూ. 8లక్షలు వెచ్చించగా ఒక్క రూపాయి కూడా రాలేదని రైతు తెలిపారు. ఇదివరకే పులివెందుల అరటి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించి, వాటికి సంబం ధించిన శాంపుల్స్ తీసుకెళ్లారు. కానీ వారివద్ద తగిన ల్యాబ్‌కు సంబధించిన పరికరాలు లేవంటూ కాలయాపన చేయడంపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ కంపెనీ నుంచి మొక్కలు తీసుకున్న తొండూరు, పులివెం దుల మండలాలకు సంబందించన రైతులు మరి కొంత మంది నష్టపోయినట్లు ఉద్యానవనశాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అరటి సాగు రైతులు కోరారు.

మహానాడులో రక్తదానం



రక్తదానం చేసిన శ్రీనివాసరెడ్డికి ప్రశంసాపత్రం అందజేస్తున్న సీఎం, చిత్రంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

కడప, మే 27 (ఆంధ్రజ్యోతి): మహానాడు సందర్భంగా అక్కడ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడంతో మొదటగా పొలిట్ బ్యూరో సభ్యుడు, కడప జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి రక్త దానం చేశారు. అనంతరం సాయంత్రం 4 గంటల వరకు దాదాపు 217 మందికి పైగా రాష్ట్రం నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి సీఎం చంద్రబాబు ప్రశంసాపత్రాలు అందించారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సులు

కడప కల్చరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా వచ్చే జూన్ 11న తమిళనాడులోని అరుణచలానికి జిల్లా పరిధిలోని ఆరు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. ఇందులో కడపతో పాటు బద్వే లు, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు డిపోల నుంచి ఒక్కో బస్సు వచ్చే నెల 10న ఆయా డిపో ల నుంచి బయలుదేరుతాయన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెక్ బౌన్స్ కేసులో బెంగళూరు వాసికి ఏడాది జైలు శిక్ష

● రూ.15లక్షలు జరిమానా

తంబళ్లపల్లె, మే 27(ఆంధ్రజ్యోతి): చెక్ బౌన్స్ కేసులో బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తికి రూ.15లక్షలు జరిమానాతో పాటు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తంబళ్లపల్లె సివిల్ కోర్టు న్యాయాధికారి ఉమర్ ఫరూక్ మంగళవారం తీర్పు ఇచ్చారు. బెంగళూరుకు చెందిన లోకనాథరెడ్డి 2018లో తంబళ్లపల్లెకు చెందిన రామ్మూర్తికి ఇచ్చిన చెక్కు బౌన్సు అయ్యింది. దీంతో రామ్మూర్తి స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో సీసీ/14/18 సెక్షన్ కింద పిటిషన్ వేశాడు. పిటిషనర్ తరుపున న్యాయ వాది గఫార్ వాదించాడు. ఈ కేసులో విచారణ పూర్తయ్యి నేరం రుజువు కావడంతో లోకనాథరెడ్డికి రూ.15లక్షలు జరిమానా, ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి ఉమర్ ఫరూక్ తీర్పు ఇచ్చారు.

ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

కలకడ, మే 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన మహిళ ఈశ్వరమ్మను కులం పేరుతో దూషించిన ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు మంగళవారం ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఈనెల 23వ తేదీ మండలం లోని గుడిబండ పంచాయతీ తెట్టుకు చెందిన ఈశ్వరమ్మ పొలంలో అగ్రకులానికి చెందిన వ్యక్తి ట్రాక్టరు వెళుతుండగా అడ్డు చెప్పింది. దీంతో ఆగ్రహించిన అదే గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, శివారెడ్డి, లోకేశ్‌రెడ్డి, రమాదేవి, పార్వతమ్మ కులం పేరుతో దూషించారన్నారు. ఈశ్వరమ్మ ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గొర్రెలపై దూసుకెళ్లిన లారీ

● 7 గొర్రెలు మృతి.. 9 గొర్రెలకు గాయాలు

గుర్రంకొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): గొర్రెల మందపై లారీ అతి వేగంగా దూసుకెళ్లడంతో 7 గొర్రెలు మృతి చెందగా..9 గొర్రెలు గాయపడిన సంఘటన ఎరికెలవానిమిట్ట వద్ద జరిగింది. పోలీసులు వివరాల మేరకు... కలకడ మండలం నడిమిచెర్లకు చెందిన చంద్రమోహన్ గొర్రెలను మేపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఇందులో భాగంగా గుర్రం కొండ మండలం చెర్లోపల్లె పంచాయితీ పరిధిలోని ఎరికెలవానిమిట్ట వద్ద మంద తోలుకొని ఉన్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి గొర్రెలు రోడ్డు దాటుతుండగా రాయచోటి నుంచి మదనపల్లె వైపు వెళ్లుతున్న లారీ గొర్రెల మందపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 7 గొర్రెలు మృతిచెందగా, 9 గొర్రెలకు గాయాలయ్యాయి. రైతుకు రూ.2లక్షలు ఆస్తినష్టం వాట్లినట్లు బాధితుడు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



చెన్నూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇర్కాన్ సర్కిల్ వద్ద గల కేసీ కెనాల్ సమీపంలో మంగళ వారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి 35 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉంటుందని తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు అక్కడకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి.. మృతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాటుసారా బట్టీలపై పోలీసు దాడులు

● 270 లీటర్ల సారా ఊట ధ్వంసం



నాటుసారా ఊటను నాశనం చేస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వాల్మీకిపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): నాటు సారా తయారీ, విక్రయాలు మానుకోకపోతే ఎంత టివారైనా సహించేది లేదని ఎక్సైజ్ టాక్స్‌ఫోర్స్ సీఐ ఎల్లయ్య హెచ్చరించారు. మంగళవారం వాల్మీకిపురం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని గుర్రం కొండ మండలంలో నాటు సారా బట్టీలపై విస్తృత దాడులు నిర్వహించారు. మండలంలోని టి.గొల్లపల్లె అటవీ ప్రాంతంలో సారా బట్టీలని ధ్వంసం చేస్తూ రహస్యంగా దాచిన 270 లీటర్ల సారా ఊటను అక్కడికక్కడే నాశ నం చేశారు. టి.గొల్లపల్లెకు చెందిన అమరనాథ్(52)ను అరెస్ట్ చేసి 5లీటర్లు సారా సీజ్ చేసి కేసు నమోదు చేశారు. సారా తయారీ పరికరాలను ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఈదాడులలో టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో వ్యక్తి హత్య



హత్యకు గురైన ఆంజనేయులు

వీరపునాయునిపల్లె మే 27 (ఆంధ్రజ్యోతి): వీరపునాయునిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన ఎ.ఆంజనేయులు (48) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో తన ఇంటి నుంచి రోడ్డులోకి వచ్చి తిరిగి ఇంటికి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా గుర్తుతెలియని దుండగులు దాడి చేసి కత్తితో గొంతు కోసి హత్య చేశారు. ఈ విషయం తెలుసుకున్న బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని ఆంజనేయులును వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్ ధ్రువీకరించారు. సమాచారం తెలిసిన ఎస్ఐ పోలీసులతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి భార్య కమలమ్మ కొందరి వ్యక్తులపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు

గుర్తు తెలియని వాహనం ఢీ.. యువకుడి మృతి

మైదుకూరు రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక నంద్యాల రోడ్డులో సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో షేక్ హుసేన్ (20) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. షేక్ హుసేన్ సొంత గ్రామం జమ్మలమడుగు. ఆరు నెలల క్రితం మైదుకూరులోని రాజీవ్‌గాంధీనగర్‌లో ఓ మహిళను వివాహం చేసుకొని.. ఇక్కడే ట్రాక్టర్‌కు కూలీగా వెళుతూ జీవనం సాగిస్తున్నాడు. కూలి డబ్బుల కోసం వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఏఎస్ఐ మురళీయాదవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

కడప క్రైం, మే 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో భగత్‌సింగ్‌నగర్‌లో నివాసం ఉంటున్న వారం రామానుజులు (21) అనే యువకుడు ఈ నెల 21న విషద్రావణం తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. రామాంజులు సీకేదిన్నెకు చెందిన యువతిని ప్రేమించాడు. తల్లిదండ్రులు అంగీకరించకపోవడంంతో ఆవేదనకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అతన్ని రిమ్స్‌కు తరలించగా అక్కడ నుండి తిరుపతికి రెఫర్ చేయడంతో అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 26న మృతి చెందాడు. ఆమేరకు కడప తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్ విగ్రహాల ఏర్పాటుకు

అనుమతులున్నాయా ?

● పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎన్టీఆర్‌సర్కిల్, మే 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దివంగత సీఎం వైఎస్ఆర్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతులున్నాయా అంటూ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. మహానాడు ప్రాంగణంలో మీడియా పాయింటు వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కడప నగరంలో మహానాడు ఏర్పాటు కోసం తమ కార్యకర్తలు కొందరు తెలిసో తెలియకో వైఎస్ విగ్రహాల వద్ద ఫ్లెక్సీలు కట్టారన్నారు. విషయం తెలుసుకున్న తమ యువనేత లోకేశ్ సమస్యలు, గొడవలు వద్దు, వెంటనే వైఎస్ విగ్రహాల వద్ద ఉన్న పసుపు తోరణాలు తొలగించాలని ఆదేశించడంతో తాము వెంటనే పచ్చ తోరణాలు తొలగించామన్నారు. అలాగే వైసీపీ నాయకులు టీడీపీ నేతల ఇళ్లపై తమ పార్టీ జెండా పెడతామంటూ మాట్లాడడం సరైందికాదన్నారు. వైఎస్ఆర్‌పై ఉన్న అభిమానంతో ముందుగానే పచ్చతోరణాలు తొలగించామని తెలిపారు. కాగా తొలిగడప దేవునికడపగా కడపకు ఎంతో చరిత్ర ఉందని, అలాంటి కడప పేరును కనుమరుగు చేస్తూ గత ప్రభుత్వం జిల్లాకు 'వైఎస్ఆర్ జిల్లాగా మార్చారన్నారు. చాలా మంది కడప పేరుతో జిల్లా ఉండేలా మార్పులు చేయాలని సూచించడంతో తిరిగి ఈ జిల్లాకు 'వైఎస్ఆర్ కడప' జిల్లాగా కూటమి ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డిపై ఉన్న గౌరవంతో సీఎం చంద్రబాబు ఆ పేరు తొలగించలేదని ఈ విషయాన్ని వైసీపీ శ్రేణులు గమనించాలని ఆయన హితవు పలికారు.

'ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి'

ప్రొద్దుటూరు టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల సమాధాన పత్రాలు రుద్దడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి గంగిరెడ్డి మోక్షిత, ఆమె తండ్రి మల్లేశ్వరరెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ విద్యార్థిని మాట్లాడుతూ తాను 6 నుంచి 10వ తరగతి వరకు ఎర్రగుంట్ల బాయిస్ హైస్కూలులో చదివానన్నారు. పదవ తరగతి పరీక్షల్లో అన్ని సబ్జెక్టుల్లో 80, 90 మార్కులు రాగా సోషియల్‌లో 21 మార్కులు రావడంతో పదవ తరగతి ఫెయిల్ అయ్యానన్నారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోగా 84 మార్కులు వచ్చాయన్నారు. తాను ఫెయిల్ కావడంతో మనోవేదనకు గురయ్యాయనని..సమాధాన పత్రాలు రుద్దడంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, తనకు పదవ తర గతిలో అన్ని సబ్జెకులలో 600 మార్కులకు గాను 537 మార్కులు వచ్చాయని, ఈ మార్కులతో ట్రిపుల్ ఐటీలో, మోడల్‌స్కూల్స్, కస్తూర్బాగాంధీ పాఠశాలలు, గురుకుల కళాశాలలో చేరే అవకాశం ఉండేదన్నారు. ఫెయిల్ కావడంతో ఆ కళాశాలలో చేరడానికి దరఖాస్తు చేసుకునే గడువు ముగిసిందన్నారు. తన మార్కులను దృష్టిలో ఉంచుకుని మంచి కళాశాలలో చేరడానికి అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈతకు వెళ్లి ఇంటర్ విద్యార్థి మృతి



విద్యార్థి మృతదేహాన్ని వెలికితీస్తున్న దృశ్యం

పులివెందుల, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊడవగండ్ల గ్రామంలో ఇంటర్ విద్యార్థి దాసరి దేవసాయి యల్లారెడ్డి (16) ఈతకు వెళ్లి మృతి చెందాడు. బంధువుల వివరాల మేరకు.... వేసవి సెలవుల కోసం కడప నుంచి తొండూరు మండలంలోని ఊడవగండ్ల గ్రామానికి (బంధువుల ఇంటికి) యల్లారెడ్డి వచ్చాడు. మంగళవారం గ్రామంలోని వ్యవసాయ బోరుబావి వద్దకు స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లాడు. అందరు ఈత ఆడుతున్న సమయంలో యల్లారెడ్డిపై నుంచి బావిలోకి దూకాడు. బావిలో ఉన్న మెటికల కింద యల్లారెడ్డి ఇరుక్కు పోయాడు. తోటి స్నేహితులు వెతికిన కనిపించకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి విద్యార్థిని మృతదేహాన్ని వెలికితీశారు. బంధువుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

వీలేరు రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల దరఖాస్తు చేసుకోవాలని గ్యారంపల్లె గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నకేశవులు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేవీపల్లె మండలం గ్యారంపల్లె గురుకుల జూనియర్ కళాశాలలో పూర్తి తాత్కాలిక ప్రాతిపదికన ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల కొరకు దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. అభ్యర్థులు ఆయా సబ్జెక్టులలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ కలిగి 50 శాతం మార్కులు సాదించి ఉండాలన్నారు. అసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను జూన్ 10వ తేదీ లోపు గ్యారం పల్లె జూనియర్ కళాశాలలో అందజేయాలని కోరారు.

మహానాడుకు తరలిన టీడీపీ శ్రేణులు

రాయచోటిటౌన్, మే27(ఆంధ్రజ్యోతి): కడప నగరంలో మంగళవారం నుంచి ప్రారంభమైన మహానాడుకు అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు వేలాదిగా తరలివెళ్లారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ పిలుపు మేరకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీ డాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాలతో ఆయన సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లాతో పాటు రాయచోటి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన టీడీపీ మండల అధ్యక్షులు, గ్రామ కమిటీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు మహానాడుకు చేరుకున్నారు. అలాగే మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి నియోజకవర్గ పరిధిలోని రామాపురం మండలం గువ్వలచెరు వు సమీపంలో సుమారు లక్ష మందికి భోజన వసతి కల్పించారు.

మహానాడుకు రాజంపేట తెలుగు తమ్ముళ్లు

రాజంపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : కడపలో మూడు రోజుల పాటు జరిగే మహానాడుకు రాజంపేట తెలుగుదేశం పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, రాజంపేట మాజీ అధ్యక్షుడు బాసినేని వెంకటశ్వర్లు నాయుడు, సంజీవరావు, డాక్టర్ నవీన్‌కుమార్, డి.వెంకటరమణనాయుడు, సుబ్బనరసయ్యనాయుడు, దగ్గుపాట రవికుమార్, గుత్తా చిట్టిబాబు మహానాడులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహానాడు మన కడపలో జరగడం అదృష్టంగా భవిస్తున్నామన్నారు.

సిద్దవటం: టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య ఆధ్వర్యంలో మంగళవారం కార్యకర్తలు మహానాడుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ మహానాడు ఒక పండుగ లాంటిదన్నారు.



మహానాడుకు హాజరైన రాజంపేట టీడీపీ నాయకులు, కార్యకర్తలు

రైల్వేకోడూరు నుంచి...

రైల్వేకోడూరు, మే 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని రైల్వేకోడూరు, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల నుంచి కడపలో నిర్వహించిన టీడీపీ మహానాడు కార్యక్రమానికి మంగళవారం నాయకులు భారీగా తరలివెళ్లారు. టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు పది వేల మంది కార్యకర్తలు, నాయకులు స్వచ్ఛందంగా ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లినట్లు వారు తెలిపారు. టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ సాంస్కృతిక విభాగంలో ప్రత్యేక వాయిద్యాలు, డప్పులు, వివిధ రకాల వేషాలను వేయించి అలరించారు.

పెనగలూరు: మహానాడుకు మండలంలోని పలు గ్రామాల నుంచి టీడీపీ నాయకులు స్వచ్ఛందంగా వెళ్లారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు ఎన్.రాంప్రసాద్‌నాయుడు, కె.బాలక్రిష్ణ, పి.బాబునాయుడు, వై.హరి ముదిరాజ్, కె.శివ నాయుడు, కేఎస్ఆర్, కె.శ్రీరాం, నాగేశ్వరనాయుడు, నరసింహానాయుడు మహానాడు మొదటిరోజు సమావేశంలో పాల్గొన్నట్లు వారు తెలిపారు.

ఒంటిమిట్ట : మహానాడు కార్యక్రమానికి రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, మాజీ ఉపాధ్యక్షుడు నామాల వెంకటయ్య ఆధ్వర్యంలో ఒంటిమిట్ట నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. పార్టీ మండల నాయకులు పామూరు సుబ్రమణ్యం, మామిళ్ల ఈశ్వరయ్య, చింతరాజుపల్లె రమణ, బాలమునెయ్య, సుధాకర్‌రాజు తరలివెళ్లారు.

సుండుపల్లె: టీడీపీ సుండుపల్లె మండల శాఖ అధ్యక్షుడు కళ్లే రెడ్డెప్ప, మాజీ అధ్యక్షుడు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్‌నాయుడు వేర్వేరుగా వాహనాల్లో వెళ్లారు. అలాగే టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మాలేపాటి శివరాంనాయుడు, తెలుగు యువత అధ్యక్షుడు సురేశ్‌నాయుడు, నాయకులు మాజీ ఎంపీటీసీ మోహన్‌బాబు, అధికార ప్రతినిధికిరణ్ నాయుడు, సుండుపల్లె గ్రామ కమిటీ అధ్యక్షుడు సుబ్బరామ, నాయకులు, కార్యకర్తలు మహానాడుకు వెళ్లారు.

లక్కిరెడ్డిపల్లె: మహానాడు కార్యక్రమానికి లక్కిరెడ్డిపల్లె మండలం నుంచి టీడీపీ మండల యువజన నాయకుడు మదన్‌మోహన్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు తరలివెళ్లారు. అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

సంబేపల్లె : మాజీ జెడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, మాజీ సర్పంచులు గోపాల్, శశిధర్‌రెడ్డి, అధ్యక్షుడు చిన్నరెడ్డెయ్యయాదవ్, టీడీపీ నాయకులు నూరెకరాల రంగారెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్బరాజుయాదవ్, బొడ్డు భాస్కర్, అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు.



రాయచోటి: మహానాడులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, నేతలు



మహానాడులో రిజిస్ట్రేషన్ చేయించుకుని సభ్యత్వ కిట్ తీసుకుంటున్న ముక్కా



సిద్దవటం: మహానాడుకు వెళుతున్న నేతలు



పెనగలూరు: మహానాడులో పాల్గొన్న నాయకులు



ఒంటిమిట్ట: మహానాడులో టీడీపీ మండలనాయకులు



సుండుపల్లి: మహానాడులో పార్టీ నాయకులు



సంబేపల్లె నుంచి మహానాడుకు చేరిన టీడీపీ నేతలు

సిద్దవటం అటవీ ప్రాంతాల్లో కూంబింగ్



నిమ్మకాయలగడ్డ ఫారెస్ట్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది

సిద్దవటం, మే 27 (ఆంధ్రజ్యోతి): సమస్యాత్మక అటవీ ప్రదేశాల్లో గత రెండు రోజులుగా ఫారెస్ట్ సిబ్బంది కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో మంగళవారం అటవీ క్షేత్ర అధికారి కళావతి మాట్లాడుతూ కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్ ఆదేశాలతో ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కొండూరు, గొల్లపల్లె, సిద్దవటం, రోళ్లబోడు, ఫారెస్ట్ బీట్‌లో సమస్యాత్మక అనుమానిత అటవీ ప్రదేశాల్లో సోమ, మంగళవారాల్లో కూంబింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేశు, ఫారెస్ట్ బీట్ అధికారి మధు, పెంచలరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అల్పాహారం - రోగులకు పండ్లు పంపిణీ



పంపిణీకి సిద్ధం చేసిన ఆహారం

నందలూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ జన్మదినం సందర్భంగా రాజంపేట అసెంబ్లీ కో కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్ ఆధ్వర్యంలో బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు, బ్రెడ్డు, బస్టాండు కూడలిలోని పేదలకు అల్పాహారం వితరణ చేశారు. అంతకుముందు కుంపిణీపురంలోని వరాహ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు చుక్కా శ్రీనివాసులు, శివారెడ్డి, విఠల్‌స్వామి, హెచ్‌డీ ప్రసాద్, మండెం నాగేంద్ర, మురళీ, జయకుమార్‌రెడ్డి, సుబ్బయ్య, మహేష్, రమణగౌడ్, హర్ష, అనిల్‌కుమార్, హరి తదితరులు పాల్గొన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి: సీఐటీయూ

రైల్వేకోడూరు, మే 27(ఆంధ్రజ్యోతి): మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం రైల్వేకోడూరు సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మామిడి పంటకు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు న్యాయం చేయాలన్నారు. కోడూరులో 70 మామిడి మండీలు ఉన్నాయని, 40 మండీల్లో మాత్రమే మామిడి వ్యాపారం సాగుతోందన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి మామిడి కాయలను రైతులు మండీలకు తరలిస్తున్నారన్నారు. చిత్తూరు జ్యూస్ పరిశ్రమలపై అధికారులు విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పులిహోరా మామిడి రకం కాయలను జ్యూస్‌కు టన్ను రూ.5,000కు తీసుకుంటున్నారన్నారు. గతంలో ఇదేరకం మామిడి కాయలను టన్ను రూ.15,000కు తీసుకునేవారన్నారు. వెంటనే మామిడి రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో శెట్టిపల్లి వీఆర్‌వో మృతి



సంజీవయ్య (ఫైల్)

సంబేపల్లె, మే27(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలం శెట్టిపల్లి వీఆర్‌వోగా పనిచేస్తున్న సంజీవయ్య అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం శిబ్యాల గ్రామానికి చెందిన సంజీవయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కడపలోని రిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన అంత్యక్రియలను వారి స్వగ్రామమైన శిబ్యాల గ్రామం సిద్దారెడ్డిగారిపల్లెలో మంగళవారం నిర్వహించారు. ఇతనికి ఇరువురు కుమారులు, ఇరువురు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు.

ప్రసాద్‌బాబు నివాళి

రాయచోటిటౌన్, మే27(ఆంధ్రజ్యోతి): సంజీవయ్య మృతదేహానికి మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం




వెటర్నరి వైద్యాధికారి డాక్టర్ శివశంకర్

సిద్దవటం, మే 27 (ఆంధ్రజ్యోతి): వాతావరణం మార్పుల దృష్ట్యా పాడి రైతులు పశువుల పాకను శుభ్రంగా పెట్టుకోవాలని, తద్వారా వ్యాధులకు దూరంగా ఉం డొచ్చని వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. మండలంలోని భాకరాపేట పశువైద్యశాలలో మంగళవారం ఆయన మా ట్లాడుతూ పశువులు, మేకలు, గేదెలు, చెరువు కుంటలలో నిల్వ ఉన్న నీటిని తాగకుండా వాటి యజమానులు జాగ్రత్త వహించాలన్నారు. దీని ప్రభావం వల్ల గొంతువాపు వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. గొంతువాపు వ్యాధికి వైద్యశాలలో వ్యాక్సిన్ అందుబాటులో ఉందన్నారు.

సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌పై ఎంపీఈవోకు వినతి

వీరబల్లి, మే27(ఆంధ్రజ్యోతి): వీరబల్లి సచివాలయంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసన్నపై పనుల కోసం వెళ్లిన వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఎంపీడీవో నూర్జహాన్‌కు వీరబల్లి వాసి శివకుమార్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంలో పొజిషన్ సర్టిఫికెట్ కోసం వెళ్లగా 'నేను ఇవ్వను ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకో' అంటూ తనపై ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు.

ముగిసిన మడితేటమ్మ తిరునాళ్లు



పూజలు అందుకున్న మడితేటమ్మ

సుండుపల్లె, మే27(ఆంధ్రజ్యోతి): మడితేటమ్మ తిరునాళ్లు మంగళవారం ఉదయం ఘనంగా ముగిసింది. గత మూడు రోజుల నుంచి చిన్నకమ్మ, పెద్దకమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకం, హోమం కార్యక్రమాలను భక్తులు నిర్వహించారు. సోమవారం రాత్రి మంగళవారం రం గురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో చాందినీ బండ్లు ద ర్శనం ఇచ్చాయి. 11 చాందినీ బండ్లను భక్తులు కట్టి మొక్కులు తీ ర్చుకున్నారు. మండల నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భ క్తులు హాజరై తిరునా ళ్లను తిలకించారు. భక్తులు అమ్మవారికి బో నాలను సమర్పించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

భోజన ఏర్పాట్ల పరిశీలన



రామాపురం,మే27(ఆంధ్రజ్యోతి): కడపలో నిర్వహించే మహానాడు సందర్భంగా రామాపురంలో నిర్వహించే భోజన వసతి ఏర్పాట్లను మంగళవారం టీడీపీ నేత మౌర్యారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మౌర్యారెడ్డి మాట్లాడుతూ భోజనంలో శుచి, శుభ్రత పాటించాలని, వాహన పార్కింగ్ ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

యోగాతో మానసిక ప్రశాంతత : ఎంపీడీవో



రాజంపేటలో యోగా చేస్తున్న అధికారులు, సిబ్బంది

రాజంపేట టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : ధ్యానం, యోగాసనాలతో ఆరోగ్య జీవనం సాధ్యమవుతుందని ఎంపీడీవో వరప్రసాద్, మండల వైద్యాధికారిని డాక్టర్ అశ్విన్ చంద్రలు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు, పంచాయతి కార్యదర్శులు, ఆరోగ్య కార్యకర్తలతో యోగా చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చునని వివరించారు. ఈ యోగాను నెలరోజుల పాటు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయని తెలిపారు. ప్రతిఒక్కరు ఈ యోగసనాల కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యోగాంధ్రలో భాగస్వాములు కావాలి

సుండుపల్లె, మే27(ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగస్వాములు కావాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సుండుపల్లె మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో అంగన్వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది, సచివాలయాల అధికారులు, సిబ్బందికి మంగళవారం మాస్టర్ ట్రైనర్ రాధారాణి యోగాలో అవగాహన తరతులు నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ యోగా నేర్చుకోవాలి

రైల్వేకోడూరు, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగా నేర్చుకోవాలని ప్రిన్సిపాల్ యం. భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా సాధన చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో 5 వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మండల పరిషత్‌లో మెగా యోగాంధ్ర

పెనగలూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఎంపీడీవో ఎస్.విజయరావు అధ్యక్షతన మంగళవారం మెగా యోగాసన కార్యక్రమం జరిగింది. సచివాలయ, ఆరోగ్య, అంగన్వాడీ సిబ్బంది ఈ మెగా యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. హైస్కూల్ పీడీ డాక్టర్ ప్రణవి, చక్రంపేట హైస్కూల్ పీడీ జయలక్ష్మీ సిబ్బందిచే యోగాసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ శ్రేయ, పీహెచ్ఎన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ నేత సాయిలోకేశ్ జన్మదిన వేడుకలు

రాజంపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాయిలోకేశ్ కార్యాలయంలో, తాళ్లపాక గ్రా మంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు జన్మదిన కార్యక్రమాల్లో పాల్గొని కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం సాయిలోకేష్‌ను శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తాళ్లపాకలో బీజేపీ నాయకులు తోట శ్రీనివాస ధీరజ్, వై.సురేష్‌రాజుల ఆధ్వర్యంలో లోకేష్ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. అనంతరం సాయిలోకేష్ మాట్లాడుతూ తన జన్మదిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రతిఒక్కరికి అభినందనలు తెలియజేశారు. తాళ్లపాకను గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేంకు తనవంతు సాయశక్తుల కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పిండిబోయిన కృష్ణయాదవ్, పోతుగుంట నాగేశ్వరరావు, మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు సునీతనారాయణవర్మ, రమణయ్య, షబ్బీర్‌అహ్మద్, సుబ్రమణ్యం, ప్రసాద్‌రెడ్డి, జ వ్వాజి సుబ్రమణ్యం, నరసింహరాజు, జైసింహరాజు, భూపతిరాజు పాల్గొన్నారు.

ప్రతిరైతు భూమిలో కుంటలు తవ్వుకోవాలి

రాజంపేట టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతు తమ భూమిలో కుంటలు తవ్వకోవాలని ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. మంగళవారం తాళ్లపాక గ్రామంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాదిహామీ పనులను ఆకస్మిక తనిఖీ చేపట్టారు. తరువాత కూలీలతో సమావేశమై ఎంతసేపు పని చేస్తున్నారని, రోజుకు ఎంత కూలి పడుతుందని, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కొంతమంది కూలి డబ్బు పడడంలేదని, తక్కువ కూలి పడుతుందని, మినీ గోకుళం షెడ్లకు బిల్లులు రాలేదని ఎంపీడీవో దృష్టికి తీసుకురాగా త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ మీకు ఎంతమందికి భూములు ఉన్నాయని అడిగారు. భూములన్నవారు చేతులెత్తడంతో ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద రైతుల పొలాల్లో కుంటలు తవ్వేందుకు చర్యలు చేపట్టిందన్నారు. వ్యవసాయ అవసరాలకు తాగునీటి వసతి సక్రమంగాలేని గ్రామాల్లో వర్షపునీరు నిల్వ ఉండేందుకు ఈ పథకం ఏర్పాటు చేసిందన్నారు.

కలెక్టర్ దృష్టికి సమస్యలు



వినతిపత్రం అందజేస్తున్న రమేష్‌నాయుడు

రాజంపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు కలిసి సమస్యలు వివరించారు. కిష్టమ్మ చెరువు వద్ద, వాజ్‌పేయినగర్‌లో 2008లో ఇచ్చిన ఇళ్ల నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయాయన్నారు. ప్రభుత్వం సత్వరమే దృష్టి సారించాలని కలెక్టర్ కోరారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు తెలియజేస్తామని హామీ ఇచ్చారు.

కిశోర బాలికల సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

గాలివీడు, మే27(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల సంక్షేమ, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం పందికుంట పంచాయతీలోని అంగన్వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 'సైబర్ నేరాలు ఆన్‌లైన్ భద్రత' అనే అంశం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల పట్ల వివక్షత చూపరాదని, వారిని అందరూ ఆదరించాలని తెలిపారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ - తొలగించిన అధికారులు

పుల్లంపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తిప్పాయపల్లె రెవెన్యూలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికావడంతో గ్రామస్థుల ఫిర్యాదు మేరకు మంగళవారం తొలగించారు. వివరాల్లోకి వెళితే... తిప్పాయపల్లె రెవెన్యూ డివిజన్‌లో సర్వేనంబరు 1060లో 20 ఎకరాల మేత బీడు పొరంబోకు భూమిని ఇదే మండలానికి చెందిన అనంతసముద్రం పంచాయతీ సిద్దవాండ్లపల్లెకు చెందిన వారు ఆక్రమించారు. 20 రోజుల క్రితం రాత్రికి రాత్రే చుట్టూ కంచె వేస్తుండగా గ్రామస్థులు వీఆర్వోకు ఫిర్యాదు చేశారు.

వీఆర్వో పట్టించుకోకపోవంతో 20 ఎకరాల స్థలాన్ని కబ్జా చేసేందుకు చుట్టూ పోలు నాటి కంచె ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిలో స్తంభాలు నాటడాన్ని గ్రామస్థులు కొందరు వ్యతిరేకించడంతో కబ్జాదారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుస్టేషన్‌లో పంచాయతీ కూడా జరిగింది. చివరకు రెవెన్యూ అధికారులకు ఒత్తిడి రావడంతో ఎట్టకేలకు తొలగించి రెండు ట్రాక్టర్లలో కంచెను, ముళ్ల తంతిని స్వాధీనం చేసుకుని తీసుకెళ్లారు. కబ్జాదారులతో వీఆర్వో లాలూచి పడ్డారని, ప్రభుత్వ భూమిని మార్చి నెలలో సబ్‌డివిజన్ చేశారని, కబ్జాదారుడికి సహకరించినందుకే మేతబీడు పొరంబోకు భూమిని సబ్‌డివిజన్ చేసి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని గ్రామస్థులు ఆరోపించారు. దీనిపై తహసీల్దారు అరవిందకిషోర్‌ను వివరణ కోరగా ఆక్రమణలు తొలగిస్తున్నట్లు తనకు తెలియదన్నారు.



మహానాడు సంబరం





టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్య క్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలా ది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాం డ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్ర బాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందుభోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండో రోజు మహానాడు కోసం అంద రూ ఉత్సాహంగా ఎదురు చూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.











కడప మహానాడు.. నభూతో నభవిష్యత్..

(కడప -ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడు నభూతో.. నభవిష్యత్ అనే రీతిలో సాగుతోంది. ఈ కార్యక్రమానికి హాజరైన సామాన్య కార్యకర్త నుంచి ముఖ్యమంత్రి వరకు అందరిలోనూ ఉత్సాహం ఉరకలు వేస్తోంది. తమ పార్టీ రాబోయే మరెన్నో సంవత్సరాలు తెలుగు ప్రజలకు సేవ చేయాలని కోరుకుంటున్నారు. ఈ సందర్భంగా మహానాడు సభా ప్రాంగణంలో.. పలువురు పార్టీ ముఖ్యులతో ఆంధ్రజ్యోతి ముచ్చటించింది.. వాళ్లు ఏమన్నారంటే..

● కడప ఎవరి అడ్డా కాదు..

వైఎస్ జగన్ అడ్డా... కడపలో మహానాడు నిర్వహిస్తున్నామనడం.. సరైంది కాదు. కడప ఎవరి అడ్డా కాదు.. జగన్ తక్కువ మెజార్టీతో ఎలాగో అదృష్టంతో గెలిచాడు. గతంలో కూడా కడపలో మహానాడు నిర్వహించాలని అనుకున్నాం.. కుదరలేదు.. ఈసారి రాయలసీమలో నిర్వహించాలని అనుకుని.. కడపలో ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది తెలుగుదేశం పార్టీ పసుపు పండుగ మహానాడుకు తరలివస్తున్నారు. కొన్ని పార్టీలు తమ కార్యకర్తలను కూలీల లాగా చూస్తాయి. టీడీపీలో కార్యకర్తలంటే కుటుంబ సభ్యులే. 10 నెలలు రాష్ట్ర అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టి పెట్టారు. కాబట్టి కార్యకర్తల గురించి ఆలోచించే సమయం దొరకలేదు. ఇక కార్యకర్తల సంక్షేమం కూడా చూస్తారు. కార్యకర్తలను కాపాడుకుంటాం.

- ఆనం వెంకటరమణారెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి

● మాకు దక్కిన గౌరవం..

కడపలో జరుగుతున్న మహానాడు నభూతో.. నభవిష్యత్ అనే రీతిలో జరుగుతోంది. 2025 సంవత్సరానికి సంబంధించి పసుపు పండుగ కడపలో జరగడం మాకు దక్కిన గౌరవం. పార్టీలో సంస్థాగతంగా ఏమేమీ మార్పులు తీసుకురావాలో.. పరిపాలనలో ఏమి మార్పులు తీసుకురావాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ పరిశీలిస్తున్నారు.

- ఆర్.మాధవి, ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే

● మూడో తరం నాయకుడిని చూస్తోంది..

కడప మహానాడు మూడవ తరం నాయకుడిని చూస్తోంది. పార్టీ స్థాపించిన ఎన్టీ రామారావు తరంలోనూ. చంద్రబాబునాయుడు తరంలోనూ.. పార్టీ బలంగా ముందుకు సాగింది.. మూడో తరం నాయకుడు నారా లోకేశ్ సారధ్యంలో పార్టీ మరింత బలంగా ముందుకు సాగుతుంది. టీడీపీ కార్యకర్తలు, నాయకుల వల్ల ఇప్పటికీ ముందుకు సాగుతోంది. 43 సంవత్సరాలలో 34 మహానాడు కార్యక్రమాలు జరిగాయి. రాష్ట్రంలో అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలంటే టీడీపీతోనే సాధ్యం. సాగునీటి, వ్యవసాయం, సంక్షేమం, విద్యారంగం.. ఏ రంగమైనా సమగ్రంగా అభివృద్ధి జరగాలంటే చంద్రబాబుకే సాధ్యం.

- పార్థసారథి, హిందూపురం ఎంపీ

● భవిష్యత్ నాయకుడు నారా లోకేశ్

ఇప్పటి వరకు అనుభవజ్ఞులైన చంద్రబాబు నాయకత్వంలో పార్టీ ముందుకు సాగింది. ఎన్నో ఒడిదుడుకులు తట్టుకుని పార్టీ నిలబడింది. చంద్రబాబు అరెస్టు సమయంలోనూ.. ఇంకా అనేక క్లిష్ట సమయాలలో నారా లోకేశ్ ఎంతో ధైర్యంగా ముందుకు నడిచారు. యువగళం పాదయాత్రను రాష్ట్రమంతటా నిర్వహించి టీడీపీ కార్యకర్తలు, నాయకుల్లో ఆత్మస్థైర్యం నింపారు. ఈ పరిస్థితుల్లో పార్టీ, రాష్ట్ర భవిష్యత్ నాయకుడు నారా లోకేశే. ఆయనకు ఎటువంటి పదవి ఇచ్చినా సముచితమే. పార్టీ అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా ఇంకా తమకు పదవులు రాలేదని ఎవరూ బాధపడాల్సిన అవసరం లేదు. పార్టీ అధినాయకత్వం అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి పదవులు ఇచ్చి గౌరవిస్తుంది.

- దూళిపాళ్ల నరేంద్ర, ఎమ్మెల్యే

● ప్రజల కోరిక మేరకే కడపలో మహానాడు

ఇక్కడి నాయకులు, ప్రజల కోరిక మేరకు కడపలో మహానాడు నిర్వహిస్తున్నాం. రాయలసీమ జిల్లాల్లో మొన్న జరిగిన ఎన్నికల్లో 99 శాతం సీట్లు టీడీపీకే వచ్చాయి. అందుకే కడపలో ఈ మహానాడు ఏర్పాటు చేసింది. ఐదు సంవత్సరాలలో వైసీపీ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మొట్టమొదటగా ఇక్కడ నిర్వహిస్తున్న మహానాడుకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది. మహానాడు రాయలసీమలో ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతానికి మహర్దశ పట్టబోతోంది.

- బీసీ జనార్దన్‌రెడ్డి, మంత్రి

● లోకేశ్ అంటే కార్యకర్తలకు భరోసా..

లోకేశ్ అంటేనే కార్యకర్తలకు, మాకు భరోసా. దేశ విదేశాలు తిరిగి పరిశ్రమలు తెచ్చి 20లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. అలాగే విద్యాశాఖలో విప్లవాత్మకమైన మార్పును తెచ్చి నాణ్యమైన విద్యను ఇవ్వబోతున్నారు. పార్టీ కార్యకర్త చనిపోతే రూ.5లక్షలు ఇస్తున్న ఏకైక పార్టీ టీడీపీ. లోకేశ్‌కు కార్యకర్తలపైనే దిశ, దశ, ధ్యాస. పార్టీ కార్యకర్తలు, అభివృద్ధిపైనే మహానాడులో తీర్మానాలుంటాయి.

- మంత్రి సవిత



ఎమ్మెల్యే మాధవి, పాలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

















మహానాడు కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు



మహానాడు వేదికపై శ్రీనివాసరెడ్డి, తదితరులు



మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, నారాయణ



ఆంజనేయస్వామి చిత్రపటాన్ని అందిస్తున్న గండి ఈవో, పూజారులు



మహానాడు ప్రాంగణం వద్ద వికాస్ హరికృష్ణ

పసుపుమయం.. మహానాడు ప్రాంగణం

- భారీగా నిలిచిపోయిన వాహనాలు
- గాలికి పడిపోయిన పలు ఫ్లెక్సీలు

కడప క్రైం, మే 27(ఆంధ్రజ్యోతి): మహానాడు సభాప్రాంగణమంతా పసుపుమయమైంది. కార్యకర్తలు, నాయకులు వస్తారనుకుంటే పెద్ద ఎత్తున అభిమానులు తరలిరావడంతో జనసంద్రంగా మారింది. ఉదయం 7గంటల నుండి కార్యకర్తలు, నాయకులు సభా ప్రాంగణంలోకి విచ్చేశారు. 9గంటల నుండి వాహనాలు పూర్తిగా స్తంభించిపోవడంతో సాక్షి సర్కిల్ నుండి సభా ప్రాంగణం వరకు రావాలంటే గంటల కొద్దీ సమయం పట్టింది. అలాగే రాయచోటి రింగు రోడ్డులో కూడా సభా ప్రాంగణానికి దాదాపు మూడు కి.మీ మేర వాహనాలు బారులు తీరాయి. మంత్రులు, పార్టీ ప్రముఖులు, కొంత మంది నాయకులు వాహనాలు వదిలేసి కాలినడకన వేదిక వద్దకు చేరుకున్నారు. కేంద్రమంత్రులు పెమ్మసాని, కింజారపు రామ్మోహన్‌నాయుడులు కూడా కాలినడకన చేరుకున్నారు. వీరికి వాహన పార్కింగ్‌పై సరైన అవగాహన లేకపోవడంతో పోలీసులు వాహనాలను అనుమతించలేదు. దీంతో కొందరు నేతలు కాలినడకన సభాప్రాంగణానికి చేరుకున్నారు. వారు వచ్చిన కార్లను పార్కింగ్ స్థలంలో పెట్టే క్రమంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇదే అదునుగా చిన్న చిన్న ఆటోలు 3 కి.మీ దూరానికి రూ.50మేర ప్రయాణికుల నుంచి బాడుగ పేరుతో దోచుకున్నారు. ప్రయాణికుల్లో ఎక్కువమంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కావడంతో అవగాహన లేక ఆటోలు దొరికిందే చాలు అని ఎక్కేశారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు రోడ్లపై వాహనాల పరిస్థితి ఇదే విధంగా సాగింది.

రోడ్లపై వాహనాలు పక్కకు తొలగింపు

సోమవారం వర్షం పడుతుండటంతో పార్కింగ్ ప్రదేశాలు బురదమయమయ్యాయి. దీంతో దూరంలో ఉన్న స్థలాల్లో కార్లు పార్కింగ్ చేయకుండా వేదిక వద్ద, రోడ్లపైనే వెహికల్స్ ఆపి ఉంచారు. అడ్డంగా ఉంచిన వాహనాలను క్రేన్ సహాయంతో పోలీసులు పక్కకు లాగారు.

నేలకొరిగిన ఫ్లెక్సీలు

మహానాడు వేడుకకు హాజరయ్యే రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే టీడీపీ నాయకులకు, శ్రేణులకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు సోమవారం వీచిన గాలులకు నేలకొరిగాయి. కొన్ని సభాప్రాంగణం ప్రారంభమయ్యే మధ్యలో విరిగిపడ్డాయి. ఆ సమయంలో పోలీసులు అప్రమత్తంగా ఉండటంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. పడిపోయిన ఫ్లెక్సీలను పోలీసులు ఎప్పటికప్పుడు తొలగించారు. ఓ భారీ ఫ్లెక్సీ నేలకొరుగుతున్న సమయంలో సీఐ బాలమద్దిలేటి అక్కడున్న సిబ్బందిని అప్రమత్తం చేయడంతో ఫ్లెక్సీ పడకుండా పోలీసులు అడ్డుకున్నారు.



సభాప్రాంగణం వద్ద నేలకొరిగిన కటౌట్



ప్రతినిధుల సభకు సభ్యత్వం రిజిస్ట్రేషన్ వద్ద బారులు



ట్రాఫిక్‌ను కంట్రోల్ చేస్తున్న కర్నూలు రేంజ్ డీఐజీ ప్రవీణ్

మహా సందడి

కడప/కలెక్టరేట్/సీకేదిన్నె/ మే 27 (ఆంధ్రజ్యోతి): కడప చరిత్రలో తొలిసారిగా టీడీపీ మహానాడు కార్యక్రమం నిర్వహిస్తోంది. సీకేదిన్నె మండలంలోని పబ్బాపురంలో ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు కన్నుల పండువగా జరుగుతోంది. ఈ సందర్భంగా ఆ మహా పండుగలో సందడి వాతావరణం నెలకొంది. కార్యకర్తల సెల్ఫీలు, మహిళా నేతల వస్త్రాధరణ, సైకిల్ యాత్రలో వచ్చిన అభిమానులతో కళకళలాడింది.

సెల్ఫీల సందడి



కడప చరిత్రలో తొలిసారిగా టీడీపీ మహానాడు కార్యక్రమం నిర్వహిస్తోంది. సీకేదిన్నె మండలంలోని పబ్బాపురంలో ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు కన్నుల పండువగా జరుగుతోంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు తెలంగాణ రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఇక మహానాడు వేదిక ఎంట్రెన్స్‌లోకి అడుగు పెట్టగానే నేతలు, కార్యకర్తలు సెల్ఫీలతో సందడి చేశారు. తమ అభిమాన నేతలను వారి సెల్‌ఫోన్లలో బంధించారు.

పసుపు కండువాలకు గిరాకీ



మహానాడు సమీపంలోని రోడ్డుకిరువైపులా టీడీపీ జెండాలు, పసుపు రంగు గొడుగులు, కండువాలు, స్టిక్కర్లు, బ్యాడ్జీలతో దుకాణాలు వెలిశాయి. దీంతో నాయకులు, కార్యకర్తలు తమ పార్టీ అభిమానం చాటుతూ పెద్ద ఎత్తున పోటీపడి కొనుగోలు చేశారు. చేనేత వస్త్రాల దుకాణాల వద్ద ఇతర జిల్లాల నేతలు, కార్యకర్తలు పసుపు రంగు ఖాదీ వస్త్రాలు, పొందూరు ఖద్దర్ కొనుగోలుతో బిజీబిజీగా గడిపారు.

లోకేశ్ అభిమానుల హడావిడి




టీడీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు వేడుకలకు కాకినాడ సిటీ నుంచి పెద్దఎత్తున యువనేత లోకేశ్ అభిమానులు తరలివచ్చారు. తమ అభిమానాన్ని చాటుకుంటూ లోకేశ్ నాయకత్వం వర్ధిల్లాలంటూ ఆయన పోటోలు ప్రదర్శిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.

పసుపు రంగు వస్త్ర ధారణలో మహిళలు



మహానాడు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చిత్తూరు జిల్లా గురజాల నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. వారిలో కొందరు మహిళలు పార్టీపై ఉన్న వీరాభిమానంతో పసుపు పచ్చరంగు పట్టు చీరలు ధరించి ఆకర్షణగా నిలిచారు.

సైకిల్‌పై 300 కి.మీ. ప్రయాణం



పల్నాడు జిల్లా గురజాల నుంచి కడపకు వచ్చిన షేక్ బాజీ మహానాడులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పసుపు వస్త్రాలు ధరించి సైకిల్‌కు టీడీపీ జెండా కట్టుకొని దాదాపు 300 కి.మీ. ప్రయాణం చేసి మహానాడు కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ అంటే తనకు ఎనలేని ఇష్టమని, అందుకే కష్టమైనా సైకిల్ తొక్కుకుంటూ వచ్చానని తెలిపారు.

1300 మందికి వైద్య పరీక్షలు



మహానాడులో తొలిరోజు జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటల వరకు దాదాపు 1300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో కంటి, ఎముకలకు సంబంధించి 800 మందికి, వివిధ రకాల సాధారణ జబ్బులకు 500 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

నేడు మదనపల్లెలో యోగా.. ముమ్మరంగా ఏర్పాట్లు

- పరిశీలించిన కలెక్టర్, జేసీ
- జిల్లాలో 5వేల మందికి అవకాశం



మైదానంలో ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

మదనపల్లె, మే 27 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురష్కరించుకుని మదనపల్లెలో బుధవారం ముందస్తు యోగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా స్థాయిలో జరిగే ఈప్రత్యేక కార్యక్రమంలో 5వేల మంది యోగాసనాలు చేసేలా ఏర్పాట్లు చేశారు. స్థానిక బెంగళూరు రోడ్డులోని బి.టి.కళాశాల మైదానంలో మున్సిపల్, రెవెన్యూ, మండల పరిషత్తు, పోలీసు, విద్యుత్తు శాఖలు సంయుక్తంగా చేపడుతున్న ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, తహసీల్దార్ ధనంజయులు, ఎంపీడీవో తాజ్‌మస్రూర్‌లు విభాగాలు వారీగా ఏర్పాట్లు చేయిస్తున్నారు. బుధవారం ఉదయం 6గంటలకు ప్రారంభమయ్యే యోగాలో డివిజన్ స్థాయిలో మహిళలు, ఇతర వర్గాల ప్రజల పాల్గొనాలన్నారు. మైదానంలో యోగా చేయడానికి ఒక్కొక్కరికి ఎనిమిది ఇన్‌టు ఆరు అడుగుట విస్తీర్ణం గడిని కేటాయించనున్నారు. యోగా చేసే ప్రతిఒక్కరికీ టీషర్టు, మ్యాట్ ఇవ్వనున్నారు. మైదానాన్ని మొత్తం 12 బ్లాకులుగా విభజించి ఒక్కో బ్లాకులో 408 మంది ఉండేలా, వీరికి ఒక్కోగురువు ఆసనాల గురించి వివరించేలా మొత్తం 5008 మందికి ఏర్పాట్లు చేశారు. ప్రధాన స్టేజీతోపాటు మరో 11 స్టేజీలు ఉండేలా చేస్తున్నా రు. ఇందులో ప్రధాన గురువు చేప్పే ఆసనాలను మిగిలిన గురువులు కూడా మైక్‌లో ఆసనాసులకు వివరిస్తారు. ఉదయం 6గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో 45 నిమిషాల నుంచి గరిష్ఠంగా గంట పాటు యోగాసనాలు చేయించనున్నారు. అంతకు ముందు సమయాన్ని, అక్కడి ఏర్పాట్లను బట్టి మొదట సాంస్కృతిక కార్యక్రమాలు, పిల్లల చేత నృత్యాలు చేయించేలా రూపకల్పన చేస్తున్నారు. ఇక్కడికి వచ్చే ప్రజల సౌకర్యార్థం తాగునీరు, శాని టేషన్, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్, విద్యు త్తులైట్లు, వాహన పార్కింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నా రు. ఇందులో భాగంగా వీఐపీ, వీవీఐపీ, మీడియా, తదితర గ్యాలరీలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఎనిమిది చోట్ల మెడికల్ క్యాంపులతో పాటు ఎని మిది అంబులెన్స్‌లను సిద్ధం చేశారు. పార్కింగ్‌లో భాగంగా కుమారపురంలో ద్విచక్ర వాహనాలు, ఈద్గాలో కార్లు, చిప్పిలి పాలడెయిరీ ప్రాంతంలో బస్సులకు పార్కింగ్ స్థలాలు కేటాయించారు. ఇందులో ముఖ్యంగా మున్సిపాలిటీ, మండల పరిషత్తు, రెవెన్యూశాఖలకు ప్రధాన బాధ్య తలు అప్పగించగా, సబ్‌కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారు. ఆయా శాఖలకు కేటాయించిన విధులు, బాధ్యతలపై కలెక్టర్ సమీక్షించారు. మదనపల్లెలో మొదటిసారిగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి యోగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కలెక్టర్, ఆయాశాఖల అధిపతులకు ఆదేశాలు జారీ చేశారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

పీలేరు రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల దరఖాస్తు చేసుకోవాలని గ్యారంపల్లె గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నకేశవులు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేవీపల్లె మండలం గ్యారంపల్లె గురుకుల జూనియర్ కళాశాలలో పూర్తి తాత్కాలిక ప్రాతిపదికన ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు సంబంధించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు ఆయా సబ్జెక్టులలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ కలిగి 50 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. దరఖాస్తులను జూన్ 10వ తేదీ లోపు గ్యారం పల్లె జూనియర్ కళాశాలలో అందజేయాలని కోరారు. వివరాలకు 8712625076 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని ఆయన తెలిపారు.

పిచ్చోడి వీరంగం

వాల్మీకిపురం, మే 27(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి రోడ్ల వెంబడి తిరుగుతూ వీరంగం చేశాడు. జాతీయ రహదారిపై వెళ్లే వాహనాల పైకి రాళ్లు విసరడం, వీధుల వెంబడి బిగ్గరగా కేకలు పెట్ట డంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైఎస్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతులున్నాయా ?

- పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎన్టీఆర్‌సర్కిల్, మే 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దివంగత సీఎం వైఎస్‌ఆర్ విగ్రహాల ఏర్పాటుకు అనుమ తులున్నాయా అంటూ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. మహానాడు ప్రాంగణంలో మీడియా పాయింటు వద్ద మంగళ వారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కడప నగరంలో మహానాడు ఏర్పాటు కోసం తమ కార్యకర్తలు కొందరు తెలిసో తెలియకో వైఎస్ విగ్రహాల వద్ద ఫ్లెక్సీలు కట్టారన్నారు. విషయం తెలుసుకున్న తమ యువనేత లోకేశ్ సమస్యలు, గొడవలు వద్దు, వెంటనే వైఎస్ విగ్రహాల వద్ద ఉన్న పసుపు తోరణాలు తొలగించాలని ఆదేశించడంతో తాము వెంటనే పచ్చ తోరణాలు తొలగించామన్నారు. అలాగే వైసీపీ నాయకులు టీడీపీ నేతల ఇళ్లపై తమ పార్టీ జెండా పెడతామంటూ మాట్లాడడం సరైంది కాదన్నారు. వైఎస్‌ఆర్‌పై ఉన్న అభిమానంతో ముందుగానే పచ్చతోరణాలు తొలగించామని తెలిపారు. కాగా తొలిగడప దేవునికడపగా కడపకు ఎంతో చరిత్ర ఉందని, అలాంటి కడప పేరును కనుమరుగు చేస్తూ గత ప్రభుత్వం జిల్లాకు 'వైఎస్‌ఆర్' జిల్లాగా మార్చారన్నారు. చాలా మంది కడప పేరుతో జిల్లా ఉండేలా మార్పు లు చేయాలని సూచించడంతో తిరిగి ఈ జిల్లాకు 'వైఎస్‌ఆర్ కడప' జిల్లాగా కూటమి ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డిపై ఉన్న గౌరవంతో సీఎం చంద్రబాబు ఆ పేరు తొలగించలేదని ఈ విషయాన్ని వైసీపీ శ్రేణులు గమనించాలని ఆయన హితవు పలికారు.

మహానాడులో రక్తదానం



రక్తదానం చేసిన శ్రీనివాసరెడ్డికి ప్రశంసాపత్రం అందజేస్తున్న సీఎం, చిత్రంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

కడప, మే 27 (ఆంధ్రజ్యోతి): మహానాడు సందర్భంగా అక్కడ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడంతో మొదటగా పొలిట్ బ్యూరో సభ్యుడు, కడప జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి రక్తదానం చేశారు. అనంతరం సాయంత్రం 4 గంటల వరకు దాదాపు 217 మందికి పైగా రాష్ట్రం నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి సీఎం చంద్రబాబు ప్రశంసాపత్రాలు అందించారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సులు

కడప కల్చరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా వచ్చే జూన్ 11న తమిళనాడులోని అరుణచలానికి జిల్లా పరిధిలోని ఆరు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. ఇందులో కడపతో పాటు బద్వే లు, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు డిపోల నుంచి ఒక్కో బస్సు వచ్చే నెల 10న ఆయా డిపో ల నుంచి బయలుదేరుతాయన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెక్ బౌన్స్ కేసులో బెంగళూరు వాసికి ఏడాది జైలు శిక్ష

- రూ.15లక్షలు జరిమానా

తంబళ్లపల్లె, మే 27(ఆంధ్రజ్యోతి): చెక్ బౌన్స్ కేసులో బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తికి రూ.15లక్షలు జరిమానాతో పాటు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తంబళ్లపల్లె సివిల్ కోర్టు న్యాయాధికారి ఉమర్ ఫరూక్ మంగళవారం తీర్పు ఇచ్చారు. బెంగళూరుకు చెందిన లోకనాథరెడ్డి 2018లో తంబళ్లపల్లెకు చెందిన రామ్మూర్తికి ఇచ్చిన చెక్కు బౌన్సు అయ్యింది. దీంతో రామ్మూర్తి స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో సీసీ/14/18 సెక్షన్ కింద పిటిషన్ వేశాడు. పిటిషనర్ తరుపున న్యాయ వాది గఫార్ వాదించాడు. ఈ కేసులో విచారణ పూర్తయ్యి నేరం రుజువు కావడంతో లోకనాథరెడ్డికి రూ.15లక్షలు జరిమానా, ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి ఉమర్ ఫరూక్ తీర్పు ఇచ్చారు.

ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

కలకడ, మే 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన మహిళ ఈశ్వర మ్మను కులం పేరుతో దూషించిన ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు మంగళవారం ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఈనెల 23వ తేదీ మండలం లోని గుడిబండ పంచాయతీ తెట్టుకు చెందిన ఈశ్వరమ్మ పొలంలో అగ్రకులానికి చెందిన వ్యక్తి ట్రాక్టరు వెళుతుండగా అడ్డు చెప్పింది. దీంతో ఆగ్రహించిన అదే గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, శివారెడ్డి, లోకేశ్‌రెడ్డి, రమాదేవి, పార్వతమ్మ కులం పేరుతో దూషించారన్నారు. ఈశ్వరమ్మ ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గొర్రెలపై దూసుకెళ్లిన లారీ

- 7 గొర్రెలు మృతి.. 9 గొర్రెలకు గాయాలు

గుర్రంకొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): గొర్రెల మందపై లారీ అతి వేగంగా దూసుకెళ్లడంతో 7 గొర్రెలు మృతి చెందగా..9 గొర్రెలు గాయపడిన సంఘటన ఎరికెలవానిమిట్ట వద్ద జరిగింది. పోలీసులు వివరాల మేరకు... కలకడ మండలం నడిమిచెర్లకు చెందిన చంద్రమోహన్ గొర్రెలను మేపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఇందులో భాగంగా గుర్రం కొండ మండలం చెర్లోపల్లె పంచాయితీ పరిధిలోని ఎరికెలవానిమిట్ట వద్ద మంద తోలుకొని ఉన్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి గొర్రెలు రోడ్డు దాటుతుండగా రాయచోటి నుంచి మదనపల్లె వైపు వెళ్లతున్న లారీ గొర్రెల మందపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 7 గొర్రెలు మృతిచెందగా, 9 గొర్రెలకు గాయాలయ్యాయి. రైతుకు రూ.2లక్షలు ఆస్తినష్టం వాట్లినట్లు బాధితుడు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



చెన్నూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇర్కాన్ సర్కిల్ వద్ద గల కేసీ కెనాల్ సమీపంలో మంగళ వారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి 35 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉంటుందని తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు అక్కడకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి.. మృతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాటుసారా బట్టీలపై పోలీసు దాడులు

- 270 లీటర్ల సారా ఊట ధ్వంసం



నాటుసారా ఊటను నాశనం చేస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వాల్మీకిపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): నాటు సారా తయారీ, విక్ర యాలు మానుకోకపోతే ఎంతటివా రైనా సహించేది లేదని ఎక్సైజ్ టాక్స్‌ఫోర్స్ సీఐ ఎల్లయ్య హెచ్చరించారు. మంగళవారం వాల్మీకిపురం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని గుర్రం కొండ మండలంలో నాటు సారా బట్టీలపై విస్తృ త దాడులు నిర్వహించారు. మండలంలోని టి.గొల్లపల్లె అటవీ ప్రాంతంలో సారా బట్టీలని ధ్వంసం చేస్తూ రహస్యంగా దాచిన 270 లీటర్ల సారా ఊటను అక్కడికక్కడే నాశ నం చేశారు. టి.గొల్లపల్లెకు చెందిన అమరనాథ్(52)ను అరెస్ట్ చేసి 5లీటర్లు సారా సీజ్ చేసి కేసు నమోదు చేశారు. సారా తయారీ పరికరాలను ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఈదాడులలో టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో వ్యక్తి హత్య



హత్యకు గురైన ఆంజనేయులు

వీరపునాయునిపల్లె మే 27 (ఆంధ్రజ్యోతి): వీరపునా యునిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన ఎ.ఆంజనేయులు (48) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో తన ఇంటి నుంచి రోడ్డులోకి వచ్చి తిరిగి ఇంటికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా గుర్తుతెలియని దుండగులు దాడి చేసి కత్తితో గొంతు కోసి హత్య చేశారు. ఈ విషయం తెలుసుకున్న బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని ఆంజనేయులును వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్ ధ్రువీకరించారు. సమాచారం తెలిసిన ఎస్ఐ పోలీసులతో హుటహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి భార్య కమలమ్మ కొందరి వ్యక్తులపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈమేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు

గుర్తు తెలియని వాహనం ఢీ.. యువకుడి మృతి

మైదుకూరు రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక నంద్యాల రోడ్డులో సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో షేక్ హుసేన్ (20) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. షేక్ హుసేన్ సొంత గ్రామం జమ్మలమడుగు. ఆరు నెలల క్రితం మైదుకూరులోని రాజీవ్‌గాంధీనగర్‌లో ఓ మహిళను వివాహం చేసుకొని.. ఇక్కడే ట్రాక్టర్‌కు కూలీగా వెళుతూ జీవనం సాగిస్తున్నాడు. కూలి డబ్బుల కోసం వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమి త్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెంది నట్లు పోలీసులు తెలిపారు. ఏఎస్ఐ మురళీయాదవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐసీడీఎస్ 'కుక్కర్ల' కొనుగోలు కేసులో.. ఇద్దరు రిటైర్డు సీడీపీవోల పెన్షన్‌లో కోత

కలికిరి, మే 27 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఐసీడీఎస్‌లో జరిగిన కుక్కర్ల కొనుగోలు కుంభకోణం కేసులో ఇద్దరు రిటైర్డు సీడీపీవోల పెన్షన్‌లో కోత విధిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. రిటైరయిన సీడీపీవోలు సి.శ్రీమాతమ్మ, పి.భారతిల పెన్షన్ నుంచి ఒక శాతం ఏడాదిపాటు కోత విధిస్తూ మంగళవారం ఆదేశాలు జారీ అయ్యాయి. ఇదే కేసులో అప్పటి కడప ఉమ్మడి జిల్లా స్త్రీ, శిశు అభి వృద్ధి శాఖ ప్రాజెక్ట్ డైరెక్టరుగా పనిచేసిన కె.లీలావతి ప్రధాన సూత్ర ధారిగా తేలింది. అయితే విచారణ జరుగుతున్న దశలోనే ఆమె నాగ పూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2019 జూలై 24న మరణించింది. దీంతో ఆమెపై కేసును ముగించారు. 2015లో జరిగిన కుక్కర్ల కొను గోలులో వ్యవహారంలో మొత్తం రూ.74,69,060ల అవినీతి జరిగిందని విచారణలో తేలింది. పీడీ కె.లీలావతితోపాటు అప్పటి కడప ఐసీడీఎస్ సీడీపీవో వి.అరుణకుమారి, కమలాపురం ఏసీడీపీవో శ్రీమాతమ్మ, లక్కిరెడ్డిపల్లె సీడీపీవో రమాదేవి, రాయచోటి సీడీపీవో పి.భారతి, సిద్దవ టం సీడీపీవో పి.నిర్మలను దోషులుగా తేల్చారు. మిగిలిన సొమ్మును ప్రభుత్వానికి నిర్దిష్ట సమయంలో తిరిగి చెల్లించని పి.నిర్మలపై వున్న మరో అభియోగంలో విడిగా మరో ఉత్తర్వు జారీ చేయనున్నట్లు కూడా ప్రభుత్వం పేర్కొంది. వీరిపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ డైరెక్టరును ప్రభుత్వం ఆదేశించింది. విచారణ దశలో మరణించిన పీడీ లీలావతిపై కేసు మూసివేసినా ఆమెకు రావలసిన పెన్షనరీ లబ్ధి నుంచి అవినీతి జరిగిన సొమ్మును రాబట్టాలని ఆదేశించారు. కాగా పొట్టెడ్డిగారిపల్లె అంగన్‌వాడీ కార్యకర్త నియమాకంలో అక్రమాలకు పాల్పడిన సీడీపీవో భారతికి గతంలోనే రెండు ఇంక్రిమెంట్లు కోత విధించారు. ఇక ప్రస్తుతం ఉద్యోగాల్లో కొనసా గుతున్న కడప సీడీపీవో వి.అరుణకుమారి, లక్కిరెడ్డిపల్లె సీడీపీవో పి.రమాదేవి, సిద్దవటం సీడీపీవో పి.నిర్మలను నిందితులుగా నిర్ధారిస్తున్నట్లు గత నెలలోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిపై తదుపరి చర్య లకు ఉత్తర్వులు రావలసి వుంది. ఈ మేరకు రాష్ట్ర స్త్రీ, శిశు, ప్రత్యేక ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యదర్శి ఏ.సూర్యకుమారి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.


ఈతకు వెళ్లి ఇంటర్ విద్యార్థి మృతి



విద్యార్థి మృతదేహాన్ని వెలికితీస్తున్న దృశ్యం

పులివెందుల, మే 27 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఊడవగండ్ల గ్రామంలో ఇంటర్ విద్యార్థి దాసరి దేవ సాయి యల్లారెడ్డి (16) ఈతకు వెళ్లి మృతి చెందాడు. బంధువుల వివరాల మేరకు.... వేసవి సెలవుల కోసం కడప నుంచి తొండూరు మండలంలోని ఊడవగండ్ల గ్రామానికి (బంధువుల ఇంటికి) యల్లారెడ్డి వచ్చాడు. మంగళవారం గ్రామంలోని వ్యవసాయ బోరుబావి వద్దకు స్నేహి తులతో కలిసి ఈతకు వెళ్లాడు. అందరు ఈత ఆడుతున్న సమయంలో యల్లారెడ్డిపై నుంచి బావిలోకి దూకాడు. బావిలో ఉన్న మెటికల కింద యల్లారెడ్డి ఇరుక్కుపోయాడు. తోటి స్నేహితులు వెతికిన కనిపించకపో వడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి విద్యార్థిని మృతదేహాన్ని వెలికితీశారు. బంధువుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మదనపల్లె: మహానాడుకు బయలుదేరిన టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


పీలేరు: మహానాడులో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న ఎమ్మెల్యే నల్లారికిశోర్ కుమార్ రెడ్డి


ములకలచెరువు: టీడీపీ శ్రేణులతో కలిసి మహానాడుకు బయలుదేరుతున్న తంబళ్లపల్లె ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

దారులన్నీ.. మహానాడు వైపే!

● పసుపు పండుగకు పెద్ద ఎత్తున తరలిన టీడీపీ నేతలు, కార్యకర్తలు

మదనపల్లె టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి) కడప వద్ద నిర్వహిస్తున్న మహానాడుకు మదనపల్లె నుంచి టీడీపీ నేతలు, నాయకులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. మంగళవారం ఉద యం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో నియోజక వర్గంలోని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ వర్గం నాయకులు వేర్వేరుగా తరలి వెళ్లారు. కాగా ఎమ్మెల్యేతో పాటు ముఖ్యనాయకులు సాయంత్రం వరకు మహానాడు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు జె.భవానిప్రసాద్, రూరల్ అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ తదితరులు వున్నారు.

ఎమ్మెల్యేను పలకరించిన చంద్రబాబు

మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సీఎం చంద్రబాబు చిరునవ్వుతో పలకరించారు. మహానాడు వేదిక మీద సీఎం చంద్రబాబును కలసిన షాజహాన్‌బాషాను పలకరించి, క్షేమ సమాచారం తెలుసుకున్నారు. మహానాడుకు మదనపల్లె నుంచి ఎంత మందిని తరలిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు.

పీలేరు: మండలంలోని ప్రతి గ్రామం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు మహానాడుకు తరలి వెళ్లారు. అక్కడ పార్టీ శ్రేణులకు ఇబ్బందులు కలుగకుండా పీలేరు మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ పురం రామ్మూర్తి చర్యలు తీసుకున్నారు.

జయచంద్రారెడ్డిని పలకరించిన నారా లోకేశ్

ములకలచెరువు: మహానాడు వేదికపై మంగళవారం తంబళ్లపల్లె నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డిని మంత్రి నారా లోకేశ్ పలకరించారు. వేదికపైకి వచ్చిన మంత్రి నేతలకు నమస్కరిస్తూ ముందుకు సాగారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి వద్ద ఆగి పలకరించారు. నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జున నాయుడు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, కురబలకోట మండల అధ్యక్షుడు వైజీ సురేంద్ర యాదవ్, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, నేతలు సురేంద్ర నాయుడు, తులసీధర్‌నాయుడు, పాల రాము తదితరులు వెళ్లారు.

మదనపల్లె: మండలంలోని గంగన్నగారిపల్లెకు చెందిన సీనియర్ నేత గంగారపు బాబురెడ్డి ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు తరలివెళ్లారు. హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ పఠాన్ ఖాదర్ ఖాన్,ఎస్‌ఏ మస్తాన్, పఠాన్ దాదు, ఎస్ సుధాకర్, నిమ్మనపల్లె సాజిద్, గంగారపు రామ్మూర్తినాయుడు, కొత్తపల్లి వెంకటేశ్, రాటకొండ మధుబాబు, కంచర్ల శ్రీనివాసులు నాయుడు, కంచర్ల రంగస్వామినాయుడు, పి.నటశేఖర్, దేవుడు రమేష్, నాదెళ్ల వైట్ రామన్న, తదితరులు ఉన్నారు

సైకిల్ యాత్రికులకు సంఘీభావం

పుంగనూరు నుంచి కడప మహానాడుకు సైకిల్ పై వెళుతున్న శ్రీకాకుళం జిల్లా టీడీపీ కార్యకర్తలకు మదనపల్లె టీడీపీ మైనారిటీ నాయకులు సంఘీభావం తెలిపారు. టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌ఏ మస్తాన్, దాదాపీర్ వారిని కలసి వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించారు. ఆర్థిక సహాయం అందజేశారు.

నిమ్మనపల్లి : మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ ఆధ్వర్యంలో పలువురు తెలుగు తమ్ముళ్లు మంగళవారం మహానాడుకు బయలు దేరారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాజీ సభ్యులు వసంతమణిరత్నం మాట్లాడుతూ ప్రతి ఏడాది మహానాడుకు క్రమం తప్పకుండా వెళుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గ సమస్యలను పార్టీ అధిష్టానానికి చెప్పుకొనే చక్కటి వేదిక అన్నారు. రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.


మహానాడు ప్రాంగణంలో పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్మోహనరాజుతో తంబళ్లపల్లె టీడీపీ నేతలు

తంబళ్లపల్లె: మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు మహానాడుకు తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్లమెంటు తెలుగుయువత ఉపాధ్యక్షుడు డేరంగుల చంద్ర, పార్లమెంటు బీసీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, మాజీ మండలాధ్యక్షుడు ఉత్తమ్‌రెడ్డి,జడ్పీటీసీ మాజీ సభ్యుడు రామచంద్ర, జయరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

వాల్మీకిపురం: మహానాడుకు వెళ్లిన వారిలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, జిల్లా పార్టీ ఎస్‌సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల రమణ, మార్కెట్ నూతన ఛైర్మన్ చంద్రమౌళి, మండల టీడీపీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పీవీ నారాయణ, రాజేంద్రాచారి, కేకేనాయుడు, రాజగోపాల్, గాంధీపేట రెడ్డి, ఆదినారాయణ, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.


పీలేరు: మహానాడు ప్రాంగణంలో పీలేరు ఏఎంసీ ఛైర్మన్ రామ్మూర్తి, నాయకులు


మదనపల్లె టౌన్: మహానాడుకు హజరైన మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ వర్గం


మదనపల్లె: మహానాడులో టీడీపీ నేతలు గంగారపు బాబురెడ్డి తదితరులు


సైకిల్ యాత్రికులకు సంఘీభావం తెలుపుతున్న టీడీపీ మైనారిటి నాయకులు

డ్రైవర్ల అత్యుత్సాహంతో ట్రాఫిక్ జామ్


మదనపల్లె మార్గంలో నిలిచిపోయిన వాహనాలు

పీలేరు, మే 27(ఆంధ్రజ్యోతి): వాహన డ్రైవర్ల అత్యుత్సాహం కారణంగా మంగళవారం సాయంత్రం పీలేరులో గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. ఆర్వోబీ నిర్మాణ పనుల కారణంగా పీలేరు-మదనపల్లె మార్గంలో పంచాయతీ కార్యాలయం నుంచి అజంతా టాకీసు మిట్ట వరకు వాహనాలను నెమ్మదిగా నడపాల్సి ఉంటుంది. రైల్వే గేటు పడితే ఎక్కువ సమయం వేచి ఉండాల్సింది ఉంటుందన్న ఆలోచనతో చాలా మంది డ్రైవర్లు ఆ ప్రాంతంలో తమ వాహనాలను కాస్త వేగంగా నడుపుతుంటారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో గేటు పడింది. గేటు ఎత్తిన తరువాత కొంత మంది డ్రైవర్ల అత్యుత్సాహం కారణంగా సుమారు గంటపాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చివరకు పోలీసులు రంగ ప్రవేశం చేసి వాహనాల రాకపోకలను పునరుద్ధరించాల్సి వచ్చింది.

చౌకదుకాణాల్లో తూకాలు సక్రమంగా ఉండాలి

మదనపల్లె టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చౌకదుకాణాల్లో తూకాలు సక్రమంగా నిర్వహించాలని లీగల్ మెట్రాలజి ఇన్‌స్పెక్టర్ రమాదేవి సూచించారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో మదన పల్లె మండలం, పట్టణంలోని 101 చౌకదుకాణాల డీలర్లు తీసుకొచ్చిన డిజిటల్ వేయింగ్ యంత్రాలను ఆమె తనిఖీ చేశారు. . జూన్ 1 నుంచి చౌక దుకాణాల్లో రేషన్ పంపిణీ ప్రారంభిస్తున్న కారణంగా వేయింగ్ యంత్రాలను తనిఖీ చేయించి తూకాలు సక్రమంగా ఉండేలా కాలిబ్రేషన్ చేయించి ఇచ్చారు.

ఆకట్టుకున్న హరికథ

మదనపల్లె అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి): స్థానిక టిప్పుసుల్తాన్ మైదానంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా మంగళవారం నిర్వహిం చిన హరికథా గానం అకట్టుకుంది. ప్రతి రోజు సాయంత్రం 5 గంటల వరకు పీలేరుకు చెందిన భాగవతారిణి స్వర్ణలత హరికథ , రాత్రి వేంక టేశ్వర నాట్యమండలి ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బీజేపీ వెంకటేష్, డాక్టర్ రామచంద్రనాయుడు తెలిపారు.

జవహర్‌లాల్ నెహ్రూకు కాంగ్రెస్ నేతల నివాళి

మదనపల్లె అర్బన్, మే27(ఆంధ్రజ్యోతి) భారత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలను, కొనియాడారు. కార్యక్రమంలో ఏపీ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్, మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రెడ్డిసాహెబ్, మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కేబాషా, నాయకులు మహబూబ్‌పీర్, మహమ్మద్‌షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి

● డ్వామా పీడీ వెంకటరత్నం

బి.కొత్తకోట, మే 27(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ సిబ్బంది అంకిత భావంతో పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని పథక సంచాలకులు వెంకటరత్నం సూచించారు. మంగళవారం బి.కొత్తకోట మండల పరిషత్‌కార్యాలయంలో మండల ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరును విశ్లేషిస్తూ మెరుగైన ఫలితాల కోసం కష్టపడి పనిచేయాలని ఆదేశించారు. కూలీల సంఖ్య తక్కువగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. బి.కొత్తకోట మండలంలో ఉద్యాన రైతులకు 200 ఎకరాలలో పండ్ల తోటల సాగుకు అవకాశం ఉందని, దీనితో పాటు పశుగ్రాసం సాగుకు ఎస్టిమేషన్‌లు వేసి పంపాలన్నారు. మండలంలో 225 కంపోస్టు యూనిట్లు, 263 ఫారంపాండ్స్ నిర్మాణం లక్ష్యంగా నిర్ణయించగా ఉపాధిహామీ సిబ్బంది సాధించలేకపోయారన్నారు. పని కోరిన కూలీలకు పని కల్పించడం, ఉద్యానపంటలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పించి లక్ష్యానికి మించి పండ్లతోటలు సాగు అయ్యేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఏపీడీ నందకుమార్‌రెడ్డి, ఏపీవో వెంకటేష్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: రంగసముద్రం, రాపూరివాండ్లపల్లె, మడుమూరు గ్రామాల్లో వాటర్ షెడ్ పనులను పరిశీలించారు. పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. మినీ గోకులంషెడ్లకు సంబంధించిన బిల్లులు రావడం లేదని పలువురు ఆయన దృష్టికి తీసుకుని వచ్చారు. ఏపీడీ నందకుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి ఏపీవో సుధాకర్, ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, టెక్నికల్ అసిస్టెంట్లు నారాయణ, శంకర, ఫీల్డ్ అసిస్టెంట్లు గోపాల్, శంకర, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


ములకలచెరువు: ఫారంపాండ్ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

ములకలచెరువు : మండలంలోని సెంట్రల్ స్కూల్, వేపూరికోట గ్రామాల్లో మంగళవారం ఫారంపండ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఫారంపాండ్ తవ్వించుకుంటే వర్షాభావ పరిస్థితుల్లో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆయన వెంట డ్వామా ఏపీడీ నందకుమార్‌రెడ్డి, ఎంపీడీవో హరినారాయణ తదితరులు ఉన్నారు.

ఉద్యోగులపై దాడులు చేస్తే కఠిన చర్యలు : కలెక్టర్

మదనపల్లె అర్బన్/ మదనపల్లె టౌన్, మే27(ఆంధ్రజ్యోతి): అక్రమ ఇంటి నిర్మాణంపై హెచ్చరించిన సచివాలయ ఉద్యోగి మోహన్‌పై దాడి చేసిన నీరుగట్టువారిపల్లెకు చెందిన వైసీపీ వార్డు మెంబరు సోముశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని మంగళవారం కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భరత్ రెడ్డి, వీఆర్వో, సచివాలయ సిబ్బంది కోళ్లబైలు పంచాయతీలో సోముశేఖర్ అక్రమంగా నిర్మిస్తున్న ఇంటిని ఎక్స్‌కవేటర్ సాయంతో కూలదోశారు. సోమవారం ఇంటి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సోముశేఖర్ కోరగా సరైన పత్రాలు లేకుండా చేయలేమని డిజిటల్ అసిస్టెంట్ మోహన్ నిరాకరించాడు. దీంతో ఆగ్రహానికి గురైన అతను ఉద్యోగిపై దాడి చేశాడు. ఈ విషయాన్ని సీపీఐ నేతలతో పాటు, సచివాలయ ఉద్యోగులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని విధి నిర్వహణలో ఉన్న వారిపై దాడులు చేయడం, అసభ్య పదజాలాన్ని వాడడం చట్టపరంగా నేరమని, ఏదైనా ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలే తప్ప, దౌర్జన్యం చేయడం ఏమాత్రం సహించమని జిల్లా కలెక్టర్ ఓ ప్రకటనలో తెలియజేశారు.


అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేసిన రెవెన్యూ సిబ్బంది

కేసు నమోదు

అక్రమ కట్టడాలు ఆన్‌లైన్ చేసేందుకు నిరాకరించిన సచివాలయం డిజటల్ అసిస్టెంట్‌పై దాడి చేసిన వైసీపీ గ్రామ పంచాయతీ వార్డు మెంబరు సోముశేఖర్ పై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ కళావెంకటరమణ తెలిపారు.

దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు సంజీవని యోగా

పీలేరు రూర ల్, మే 27 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు సంజీవని యోగా అని పీలేరు ఎంపీడీవో శివశంకర్, యోగా థెరపిస్ట్ డాక్టర్ పీవీఎస్. లక్ష్మి తెలిపారు. మంగళవారం యోగాంధ్ర కార్యక్రమంలో బాగంగా పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సచివాలయ, అంగన్‌వాడీ, మెడికల్ సిబ్బందికి యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయసుతో నిమిత్తం లేకుండా అందరూ యోగాసనాలు వేయవచ్చునని తెలిపారు. దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని పిలుపునిచ్చారు. ప్రపంచానికి భారతదేశం అందించిన ఒక గొప్పవరం యోగా అని తెలిపారు. ఇంతటి విశిష్టత కలిగిన యోగాపై పూర్తి అవగాహన కలిగి ఉండడంతోపాటు గ్రామీణ ప్రజలలో యోగాపై అవగాహన కల్పించాల న్నారు. యోగాసనాలు వేయడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతాయని తెలిపారు. తీవ్రమైన ఒత్తిడిని సైతం యోగా తగ్గిస్తుందని తెలిపారు. ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుందన్నారు. యోగాంధ్ర కార్యక్రమం మే 21వ తేదీ నుంచి జూన్ 21 వరకు కొనసాగుతుందని వివరించారు. ప్రతి రోజూ ఉచితంగా శిక్షణ ఇస్తారని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం ఆసుపత్రులకు వెల్లకుండా సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్ ఖాన్, ఈవో గురుమోహన్, మండలంలోని సచివాలయ కార్యదర్శులు, అంగన్‌వాడీ, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.


పీలేరు రూరల్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సాధన చేస్తున్న మహిళలు

నేడు పీలేరులో మినీ యోగాంధ్ర

పీలేరు : మంగళవారం పీలేరులో మినీ యోగాంధ్ర కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు భీమేశ్వర రావు తెలిపారు. మదనపల్లె మార్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల మధ్య ప్రజలందరికీ ఉచిత యోగా శిక్షణ ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ మేరకు ఆయన ఎంపీడీవో శివశంకర్, డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి జ్ఞానశేఖర్, యోగా శిక్షకురాలు పీవీఎస్ లక్ష్మీతో కలిసి మంగళవారం క్రీడా మైదానాన్ని శుభ్రపరిచారు. ప్రజలు యోగా చేసుకునేందుకు అనువుగా క్రీడా మైదానాన్ని తీర్చిదిద్దారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీ

నిమ్మనపల్లి, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతీ హరిజనవాడలో మంగళవారం జనసేన నియోజకవర్గ నాయకుడు శ్రీరామ రామాంజనేయులు ఆధ్వర్యంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు సుమారు 100 కుటుంబాలకు పైగా సభ్యులను నమోదు చేశామన్నారు. పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఆశయాలను సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ప్రధాన ధ్యేయం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగదీశ్, గురుప్రసాద్, నాగరాజు, నవాజ్, లీలాకర్ జనసేన వీర మహిళలు పాల్గొన్నారు.


కిట్లను పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు

సాగునీటి సాధనకు 31న 'చలో సంగమేశ్వరం'

ములకలచెరువు, మే 27(ఆంధ్రజ్యోతి): రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 31న తలపెట్టిన చలో సంగమేశ్వరం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉమ్మడి రాష్ట్ర విజిలెన్స్ ఛైర్మన్ తనకంటి వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం చలో సంగమేశ్వరం సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టును పూర్తిగా రాయలసీమ తాగు, సాగునీటికే కేటాయించాలని, కృష్ణానది యాజమాన్య బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం సంగమేశ్వరం వద్ద నిర్వహించే భారీ బహిరంగ సభకు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ ఛైర్మన్ సదాశివప్ప, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, సాగునీటి సాధన సమితి సభ్యులు రమణారెడ్డి, రాము, నరసింహారెడ్డి, రెడ్డిమల్లప్ప, రైతులు సుబ్బయ్య, ఈశ్వరప్ప, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తులపై మహిళలకు శిక్షణ

నిమ్మనపల్లి, మే 27(ఆంధ్రజ్యోతి): శ్రీజ డెయిరీ మహిళా పాల ఉత్పత్తిదారుల ఏర్పడిన సంస్థ అని ఏరియా మేనేజర్ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో గ్రూపు మహిళలకు శ్రీజ పాల ఉత్పత్తులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా పాల ఉత్పత్తిదారులే బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లను ఎంచుకొనే అవకాశం ఉందని తెలిపారు. సేకరించిన పాలతో వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేసి వినియోగదారులకు అందుబాటులో ఉంచుతుందని తెలిపారు. శ్రీజ డైరీ ద్వారా క్రమం తప్పకుండా పాల సేకరణ చేసి అధిక లాభాలు సాధించవచ్చని తెలిపారు. చదువుకున్న గ్రూపు సభ్యులకు పూర్తి బాధ్యతలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మురళి, మనోజ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

భక్తిశ్రద్ధలతో రౌద్రాల అంకాళమ్మ జాతర

పీలేరు, మే 27(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత రౌద్రాల అంకాళమ్మ ఐదు వారాల జాతరలో భాగంగా మంగళవారం మహిళలు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాలు సమర్పించుకున్నారు. ఉదయాత్పూర్వమే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రకాశం రోడ్డులోని నడివీధి గంగమ్మకుప్రత్యేక పూజలు నిర్వహించా రు. జాతర సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు నాగయ్య, వెంకటరమణ, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.


రౌద్రాల అంకాళమ్మకు బోనాలు తీసుకెళుతున్న లక్ష్మీపురం మహిళలు

జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సును విజయవంతం చేయాలి

పీలేరు, మే 27(ఆంధ్రజ్యోతి): ఈ నెల 31న రాయచోటిలో నిర్వహించనున్న జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం వారు పీలేరు సదస్సు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు సాంబశివ, పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేశ్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో విస్తారంగా ఖనిజ నిక్షేపాలున్నా పరిశ్రమల స్థాపనపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి నాలుగేళ్లు అవుతున్నా దాని పునర్నిర్మాణంపై స్పష్టత లేదన్నారు. మదనపల్లె ప్రాంతంలో హంద్రీ-నీవా కాలువ పనులు పూర్తిగా స్తంభించిపోయాయని, మదనపల్లె పట్టణ దాహార్తి తీర్చేందుకు నిర్మిస్తున్న చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ పూర్తి కావడానికి నిధులు నిండుకున్నాయని తెలిపారు. కడప - బెంగళూరు రైల్వేలైను పనులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా సమగ్రాభివృద్ధి జరగాలంటే జిల్లాలోని ప్రజాప్రతినిధులు సంఘటితమై నిధుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. 31వ తేదీ రాయచోటిలోని ప్రీతమ్ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసిన సదస్సుకు జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నరసింహులు, యశోదా, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోబీ పనులకు తొలగిన ఆటంకం

పీలేరు, మే 27(ఆంధ్రజ్యోతి): పీలేరు-మదనపల్లె మార్గంలోని ఆర్వోబీ నిర్మాణ పనులకు అడ్డంకిగా ఉన్న నిర్మాణాల తొలగింపు పనులకు మంగళవారం అధికారులు ప్రారంభించారు. కోర్టు వివాదాల కారణంగా పనులు నిలిచిపోయిన సంగతి పాఠకులకు తెలిసిందే. ఎన్‌హెచ్ అధికారులు, కాంట్రాక్టు సంస్థ సిబ్బంది ఆ ఇంటి యజమానితో పలు దఫాలు చర్చలు జరిపి ఆ ఇంటి తొలగింపు పనులు చేపట్టడం, రైల్వే గేటు మార్పుకు రైల్వే అధికారులు పచ్చజెండా ఊపడంతో ఆర్వోబీ నిర్మాణ పనులు వేగం పుంజుకునే అవకాశం ఏర్పడింది.


రైల్వే గేటు వద్ద నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం

రమాబాయి త్యాగం మరువలేనిది

మదనపల్లె, మే 27(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల కోసం తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు అంబేడ్కర్ అయితే, ఆ మహనీయుడి కష్టాలను, కన్నీళ్లను పాలుపంచుకుని ఆయన విజయం వెనుక నిలిచిన త్యాగమూర్తి మాతా రమాబాయి అని బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్ అన్నారు. అంబేడ్కర్ ధర్మపత్ని రమాబాయి వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక బాస్ కార్యాలయంలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడు తూ..అంబేడ్కర్ సామాజిక న్యాయం-సమానత్వం కోసం పోరాడుతున్నపుడు ఆయనకు అండగా నిలిచిన ఆదర్శ మహిళ, త్యాగానికి ప్రతిరూపం, ఆత్మగౌరవానికి నిలువెత్తు నిదర్శనమన్నారు.కార్యక్రమంలో బాస్, వీసీకే నాయకులు ముత్యాలమోహన్, గంగులప్ప, రవిశంకర్, గంగాధర్, కృష్ణ, రాయల్‌సూరి, నారాయణ, హైదర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.


రమాబాయి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వీసీకే, బాస్ నేతలు

పీలేరు రూరల్: స్థానిక మాలమహానాడు కార్యాలయంలో రమాబాయి చిత్రపటానికి నివాళులర్పించి 90వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమ్మల ధరణీకుమార్, నాయకులు వెంకటేష్, దుర్గాప్రసాద్, బాలగంగాధర్, కాయితి రవి, రవిచంద్ర, రమేష్, రెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో దోమల మందు పిచికారీ

మదనపల్లె అర్బన్, మే27 ఆంధ్రజ్యోతి): మండలంలోని జవహర్ నవోదయ స్కూల్, పాలిటెక్నిక్ కళాశాలలో దోమల నివారణ మందులు పిచికారీ చేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తెలిపారు. మదనపల్లె సబ్ యూనియల్ ఆఫీసర్ ఖలీలుల్లాఖాన్ ఆధ్వర్యంలో కీటక జనిత వ్యాధులు, మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, బోదకాలు, మెదుడువాపు జ్వరాలు ప్రభలకుండా మందు జాగ్రత్త చర్యలు తీసుకొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీలు, పర్యవేక్షకులు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు పూజలు

మదనపల్లె అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి) : స్థానిక కోర్టులో వెలసిన గంగమ్మకు మంగళవారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకుడు సుష్మిత్ పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు. మహిళలు రాహుకాల సమయంలో పూజలు నిర్వహించారు. అనంతరం పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. నిమ్మకాయలపై నెయ్యి ఒత్తులతో దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పురి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు కార్యదర్శి మార్పూరి ప్రభాకర్‌నాయుడు, ట్రెజరర్లు రంగస్వామి నాయుడు, కరుణాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి వైద్య పరీక్షలు

మదనపల్లె అర్బన్, మే27(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మోసం చేసి, తప్పించుకు తిరుగుతూ మదనపల్లెలో దాక్కున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన వ్యక్తిని మంగళవారం ఆ రాష్ట్ర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మదనపల్లె ఆస్పత్రిలో మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, గోపాల్ మండలానికి చెందిన జావీద్ విష్ణు(37) స్థానికంగా ఓ టీస్టాల్ పని చేస్తుండగా, పశ్చిమ బెంగాల్ పోలీసులు అరెస్టు చేశారు. మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి తరలించారు.